Follow: @ANNTELUGU

22-09-2026

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్   సంపుటి- 23   సంచిక- 243   పేజీలు-08   వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM



## గ్రామీణ చెరువులకు కొత్త రూపు

- పిఠాపురంలో రూ.6 కోట్లతో 11 చెరువుల అభివృద్ధి
- రూ.73 లక్షలతో మైసమ్మ చెరువు సుందరీకరణ.
- ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్.

**పిఠాపురం,మహా.** గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగానే కాకుండా ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం, విశ్రాంతిని అందించే సామాజిక వేదికలుగా తీర్చిదిద్దే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం తన నియోజకవర్గంలోని ఫకృద్దీన్ పాలెం మైసమ్మ చెరువును ప్రారంభించారు. రూ.73 లక్షలతో అభివృద్ధి చేసిన ఈ చెరువులో వాకింగ్ ట్రాక్, బహిరంగ వ్యాయామశాల, చిన్నారుల ఉద్యాన వనం, మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్

## పుతిన్ దే హవా



- రష్యా పార్లమెంట్ ఎన్నికల్లో పుతిన్ పార్టీ రికార్డు విజయం
- 450లో 355 స్థానాలు కైవసం.
- 40 స్థానాలకే కమ్యూనిస్టు పార్టీ పరిమితం

02

## ప్రెసిడెంట్ ట్రంప్ వార్తలు ప్రసారం చేయం



- అమెరికాలో ప్రముఖ టీవీ చానెల్స్ ప్రకటన

02

## డీఎస్సీపై చర్చిద్దాం దమ్ముంటే అసెంబ్లీకి రండి



- వైసీపీకి సీఎం చంద్రబాబు ఛాలెంజ్
- కుప్పం సభలో వైసీపీపై విరుచుకుపడ్డ సీఎం
- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడులపై ఆగ్రహం

03



### వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల జాప్యంపై

# సీఎం సీరియస్

**24గంటలు.. మూడు షిఫ్ట్ లలో పనులు జరిగేలా చూడాలని ఆదేశం**

**హైదరాబాద్, మహా** : వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతోండటంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీన్ ఛానల్ ద్వారా క్రమం తప్పకుండా నిధులు ఇస్తున్నప్పటికీ పనులు ఆశించిన స్థాయిలో వేగంగా ఎందుకు జరగడం లేదని అధికారులను నిలదీశారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రి నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, రాబోయే 30 రోజుల్లో రోజుకు 24 గంటల పాటు పనులు జరిగేలా ప్రత్యేక వర్క్ షెడ్యూల్ తయారు చేసుకొని ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, సీఎంవో అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. ఇక నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రతి రోజు స్వయంగా ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించాలని తేల్చిచెప్పారు. త్వరలోనే వరంగల్ ఆస్పత్రిలో ఓపీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఇదే ఈ సమావేశంలో భాగంగా సనత్‌నగర్ టిమ్స్ అంశంపైనా సీఎం చర్చించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్య సిబ్బంది సౌకర్యార్థం స్టాఫ్ క్వార్టర్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, సనత్‌నగర్ టిమ్స్ నిర్వహణ బాధ్యతలను మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ఒక ప్రత్యేక ఏజెన్సీకి అప్పగించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### రేవంత్

# ప్లాన్ హిట్

**ఫ్యూచర్ సిటీకి.. పెట్టుబడుల వెల్లువ**






- రూ.70 వేల కోట్లు ఏఐ డేటా సెంటర్
- ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న నయా సిటీ ప్లాన్
- డిసెంబర్ లో మాస్టర్ ప్లాన్ ఆవిష్కరణ.

**హైదరాబాద్, మహా.**

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా మరింత విస్తరించడంతో పాటు తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రణాళికలను ముందుకు తీసుకెళ్తోంది. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలోనే తొలి నెట్ జీరో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. హైదరాబాద్ భవిష్యత్ విస్తరణకు ఫ్యూచర్ సిటీని కీలక కేంద్రంగా ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న ఈ నగరాన్ని నెట్ జీరో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆధునిక మౌలిక వసతులు, పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, విద్య, వైద్యం మిగతా 2వ పేజీలో



కూల్చివేతల ఫోటో

## "మహా" ఎఫెక్ట్..!

### జోడిమెట్లలో అక్రమ నిర్మాణాల

# కూల్చివేత...!

అక్రమాలపై మహాపత్రిక అక్షరసమరం స్పందించిన అధికారయంత్రాంగం.. స్థానికుల హర్షం

**మహా, సిటీ బ్యూరో, హైదరాబాద్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్, పోచారం డివిజన్ జోడిమెట్ల వద్ద జాతీయ రహదారి పక్కన చేపట్టిన అక్రమ షెడ్ నిర్మాణంపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ నిర్మాణంపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. అయితే, ఈ అంశంపై "మహా" పత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో అధికార యంత్రాంగంలో చలనం వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్రమ షెడ్డును శనివారం కూల్చివేశారు.

**అనుమతులు లేకుండా నిర్మాణాలు..**

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో కొంతకాలంగా భారీ షెడ్ నిర్మాణం సాగుతోంది. దీనిపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదు వచ్చినప్పుడల్లా 23 రోజులు పనులు నిలిపివేసి, ఆ తర్వాత మళ్లీ నిర్మాణాన్ని పునఃప్రారంభిస్తున్నారని మిగతా 2వ పేజీలో

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సర్కార్ గుడ్‌న్యూస్

04

- నిర్మాణంలో ఉన్న ఇళ్లకు 'వన్‌టైమ్' క్లియరెన్స్.
- ప్రారంభించని వారి మంజూరు రద్దు.
- నగరంలో వేగంగా ఇందిరమ్మ టవర్ల అడుగులు.
- రాయదుర్గంలో 480 ఫ్లాట్ల నిర్మాణం.
- రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

## రామ మందిరంలో భారీ కుంభకోణం

- 105 సార్లు విరాళాల చోరీ
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఇప్పటి వరకు 8 మంది అరెస్ట్

03



## ఆ వందల ఎకరాల్లో మా వాటా ఎక్కడ ?

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డంగా దోచుకుంది
- కేటీఆర్ కు సంతోశ్ రావు బినామీ
- చెప్పలు కూడా లేని సంతోశ్ రావుకు వందల ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయి
- కాంగ్రెస్ నేత రమ్యారావు

03



# జోడిమెట్లలో అక్రమ నిర్మాణాల కూల్చివేత...!

(మొదటి పేజీ తరువాయి )
స్థానికులు ఆరోపించారు. స్థానికుల ఆందోళనను, అక్రమ నిర్మాణాల తీరును "మహా" కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చింది.

**హర్షం వ్యక్తం చేసిన స్థానికులు:**
అధికారులు స్పందించి కూల్చివేతలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కేవలం కూల్చివేతలతో సరిపెట్టకుండా, ఈ అక్రమ నిర్మాణానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ ప్రదేశంలో మళ్లీ అక్రమ నిర్మాణాలు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని, అలాగే ఘట్కేసర్ సర్కిల్ లోని ఇతర ప్రాంతాల్లో ఉన్న అక్రమ నిర్మాణాలపై కూడా దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

**"మహా కథనాలకు స్పందించిన అధికారులు**
జోడిమెట్లలో అక్రమ షెడ్ నిర్మాణంపై "మహా"లో వరుస కథనాలు ప్రచురితమైన తర్వాత అధికార యంత్రాంగం స్పందించడం గమనార్హం. స్థానికుల ఫిర్యాదులకు తోడు మీడియా కథనాలు కూడా తోడవడంతో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి కూల్చివేత చర్యలు చేపట్టారు.



# రేవంత్ ప్లాన్ హిట్

(మొదటి పేజీ తరువాయి )
, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాలను ఒకే ప్రాంతంలో అనుసంధానించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

**డిసెంబరులో మాస్టర్ ప్లాన్ ఆవిష్కరణ**
ఫ్యూచర్ సిటీకి సంబంధించిన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను డిసెంబరులో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 సందర్భంగా ఆవిష్కరించనున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. దీంతో ఫ్యూచర్ సిటీ ప్రణాళికను అంతర్జాతీయ పెట్టుబడిదారులకు పరిచయం చేసే వేదికగా ఈ సదస్సు నిలవనుంది.

**రూ.70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్**
ఫ్యూచర్ సిటీ ప్రణాళికలో సాంకేతిక రంగానికి భారీ ప్రాధాన్యం కల్పిస్తున్నారు. టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ రూ.70 వేల కోట్ల పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద కృత్రిమ మేధా డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఒక గిగావాట్ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు అభివృద్ధి చేయనున్నట్లు అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. హైపర్‌వాల్ట్ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7,000 ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కృత్రిమ మేధ, అధునాతన కంప్యూటింగ్, డేటా కేంద్రాలు, విద్యుత్, శీతలీకరణ, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, నిర్వహణ వంటి అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

**అమెజాన్ నుంచి మరో భారీ పెట్టుబడి**
ఫ్యూచర్ సిటీ పరిధిలో మరో భారీ సాంకేతిక పెట్టుబడి కూడా కొనసాగుతోంది. రూ.1 లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని ముఖ్యమంత్రి వెల్లడించారు. భారీ డేటా మౌలిక వసతుల ప్రాజెక్టులు హైదరాబాద్ పరిసర ప్రాంతాలను దేశంలోని ప్రధాన డిజిటల్ మౌలిక




వసతుల కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చేసే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం వివరిస్తోంది.

**ప్రత్యేక పారిశ్రామిక జోన్లు**
ఫ్యూచర్ సిటీలో ఒకే తరహా పరిశ్రమల సమూహం కాకుండా ప్రత్యేక రంగాల ఆధారంగా వివిధ జోన్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ వంటి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధితో పాటు హైదరాబాద్ చుట్టూ రవాణా మౌలిక వసతులను విస్తరించడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, డ్రైపోర్టులు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి ద్వారా నగరానికి వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలకు మెరుగైన అనుసంధానం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**మూడు పారిశ్రామిక కారిడార్లు**
హైదరాబాద్‌ను హైదరాబాద్-నాగపూర్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానించడం ద్వారా పారిశ్రామిక కార్యకలాపాలను విస్తరించాలన్నది ప్రభుత్వ ప్రణాళికలో భాగంగా ఉంది. ఈ కారిడార్లను రవాణా, పరిశ్రమలు, సరఫరా వ్యవస్థలకు అనుసంధానించే దీర్ఘకాలిక మౌలిక వసతుల ప్రణాళికగా ప్రభుత్వం పేర్కొంటోంది.

**ప్రపంచ పెట్టుబడుల కోసం**
**తెలంగాణ ఆహ్వానం**
అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ ప్రతినిధులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్‌లో సింగపూర్ ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో తెలంగాణలో పెట్టుబడులకు రావాలని ఆయన ఆహ్వానించారు. సింగపూర్ ప్రతినిధులు తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుపై ఆసక్తి వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. పెట్టుబడులతో పాటు అంతర్జాతీయ విద్యా సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం డిసెంబర్ 2026 నుంచి హైదరాబాద్‌లో కార్యనిర్వాహక విద్యా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, వ్యాపార పాఠశాలలు, పరిశోధనా సంస్థలతో భాగస్వామ్యాలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. హైదరాబాద్ అభివృద్ధిని కొత్త ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయకుండా పాత నగర ప్రాంతాల్లోనూ మౌలిక వసతుల ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. చాంచల్‌గూడ-సంతోష్‌నగర్ ఫ్లైఓవర్, పాత నగర మెట్రో ప్రతిపాదన, కొత్త ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, మూసీ పునరుజ్జీవన కార్యక్రమం వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం ప్రస్తావిస్తోంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక కారిడార్లు, డేటా సెంటర్లు, నైపుణ్యాభివృద్ధి, మౌలిక వసతులు ఈ దీర్ఘకాలిక లక్ష్యంలో కీలక భాగాలుగా ప్రభుత్వం వివరిస్తోంది.

### ఎదురులేని హైదరాబాద్

ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలను పరిశీలిస్తే హైదరాబాద్ అభివృద్ధిని కేవలం ప్రస్తుత నగర పరిమితుల్లో మౌలిక వసతులు పెంచే కార్యక్రమంగా కాకుండా, నగర పరిసర ప్రాంతాలను కొత్త ఆర్థిక కేంద్రాలుగా తీర్చిదిద్దే విస్తృత ప్రణాళికగా చూడవచ్చు. ఫ్యూచర్ సిటీ, డేటా సెంటర్లు, ఏఐ, జీవశాస్త్రాలు, విద్య, ఆరోగ్యం, విద్యుత్ వాహనాలు, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాలను ఒకే అభివృద్ధి వ్యవస్థలో అనుసంధానించాలన్నది ప్రభుత్వ ప్రణాళికల్లో కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమలైతే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాంకేతిక, పారిశ్రామిక, విద్యా, వైద్య, నైపుణ్య రంగాల విస్తరణకు అవకాశం ఉంటుంది. అయితే ఈ పరిణామాల తుది ప్రభావాన్ని ప్రాజెక్టుల అమలు, పెట్టుబడుల వాస్తవ ప్రవాహం, ఉద్యోగాల సృష్టి, మౌలిక వసతుల సామర్థ్యం వంటి కొలమానాల ఆధారంగానే అంచనా వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం మాత్రం తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌ను భవిష్యత్ సాంకేతిక, పెట్టుబడి కేంద్రంగా మలచే దిశగా ఫ్యూచర్ సిటీని ప్రధాన ప్రాజెక్టుగా ముందుకు తీసుకెళ్తున్నది స్పష్టంగా కనిపిస్తోంది.

# పుతిన్ దే హవా

**మహా డెస్క్, :** రష్యా పార్లమెంట్ దిగువ సభ స్టేట్ డ్యూమా ఎన్నికల్లో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు మద్దతుగా ఉన్న యునైటెడ్ రష్యా పార్టీ రికార్డు స్థాయి ఆధిక్యాన్ని సాధించింది. 450 స్థానాలున్న డ్యూమాలో 355 స్థానాలను దక్కించుకునే దిశగా పార్టీ ముందంజలో ఉందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రాథమిక ఫలితాలు వెల్లడించాయి. 95 శాతానికి పైగా ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి యునైటెడ్ రష్యాకు 57.83 శాతం ఓట్లు వచ్చినట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

**355 స్థానాలతో కొత్త రికార్డు**
యునైటెడ్ రష్యా సాధించిన 355 స్థానాలు ఆ పార్టీ స్టేట్ డ్యూమా చరిత్రలో అత్యధిక సంఖ్యగా నమోదయ్యాయి. 2016 ఎన్నికల్లో సాధించిన 343 స్థానాల రికార్డును తాజా ఫలితాలు అధిగమించాయి. 450 స్థానాల డ్యూమాలో రాజ్యాంగ మెజారిటీకి 301 స్థానాలు అవసరం కాగా, 355 స్థానాలతో యునైటెడ్ రష్యా ఆ సంఖ్యను గణనీయంగా అధిగమించింది. 2021లో జరిగిన స్టేట్ డ్యూమా ఎన్నికల్లో యునైటెడ్ రష్యాకు 49.8 శాతం ఓట్లు వచ్చాయి. తాజా ఎన్నికల్లో 57.83 శాతం ఓట్లు నమోదయ్యాయి. అంటే గత ఎన్నికలతో పోలిస్తే పార్టీ ఓట్ల వాటా గణనీయంగా పెరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రాథమిక లెక్కల ప్రకారం కమ్యూనిస్ట్ పార్టీకి 40 స్థానాలు, లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి 25, న్యూ పీపుల్ పార్టీకి 20, ఏ జస్ట్ రష్యా పార్టీకి 4 స్థానాలు దక్కే పరిస్థితి ఏర్పడింది. ఈ గణాంకాల ప్రకారం యునైటెడ్ రష్యా మినహా మిగిలిన నాలుగు పార్టీలు డ్యూమాలో ప్రాతినిధ్యం పొందనున్నాయి.

**59.32 శాతం పోలింగ్**
మూడు రోజులపాటు జరిగిన ఎన్నికల్లో మొత్తం పోలింగ్ శాతం 59.32గా నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం అధిపతి ఎల్లా పామ్‌ఫిలోవా తెలిపారు. 2021లో నమోదైన సుమారు 51.7 శాతం పోలింగ్‌తో పోలిస్తే తాజా ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యం పెరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకారం ఇది ఇటీవలి డ్యూమా ఎన్నికలతో పోలిస్తే అధిక పోలింగ్‌గా నమోదైంది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా పూర్తి స్థాయి సైనిక దాడి ప్రారంభించిన తర్వాత జరుగుతున్న తొలి స్టేట్ డ్యూమా ఎన్నికలు ఇవే. అధ్యక్షుడు పుతిన్ ఈ ఎన్నికలను దేశ ఐక్యతకు, తన ప్రభుత్వానికి ప్రజల మద్దతుకు సంబంధించిన పరీక్షగా ప్రస్తావించినట్లు అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి.

**రాజ్యాంగ మెజారిటీతో పుతిన్ ప్రభుత్వానికి బలం**
355 స్థానాలతో యునైటెడ్ రష్యా రాజ్యాంగ మెజారిటీని కొనసాగించనుంది. రష్యా పార్లమెంటులో చట్టాల ఆమోదం, రాజ్యాంగపరమైన మార్పులకు సంబంధించిన ప్రక్రియల్లో ఈ స్థాయి మెజారిటీకి ప్రాధాన్యం ఉంటుంది. ఈ ఎన్నికలను పుతిన్ ప్రభుత్వం ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో ప్రజల మద్దతును కొలిచే సందర్భంగా ప్రస్తావించింది. యునైటెడ్ రష్యా భారీ మెజారిటీ సాధించడం ప్రభుత్వానికి రాజకీయంగా బలమైన పార్లమెంటరీ స్థానం కల్పిస్తుంది. అయితే ప్రతిపక్ష అభ్యర్థులపై ఉన్న పరిమితులు, రాజకీయ వాతావరణం, ఎన్నికల పర్యవేక్షణకు సంబంధించిన అంతర్జాతీయ విమర్శలను పరిగణనలోకి తీసుకోకుండా ఈ ఫలితాన్ని యుద్ధంపై రష్యా ప్రజల ఏకాభిప్రాయంగా నిర్ధారించడం సాధ్యం కాదు. స్టేట్ డ్యూమా ఎన్నికలతో పాటు పలు రష్యా ప్రాంతాల్లో గవర్నర్ ఎన్నికలు కూడా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో పుతిన్‌కు అనుకూలంగా ఉన్న అభ్యర్థులు అనేక చోట్ల విజయం సాధించినట్లు ప్రాథమిక ఫలితాలు వెల్లడించాయి. చెచెన్యా గవర్నర్ రంజాన్ కదిరోవ్‌కు 99.85 శాతం ఓట్లు వచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ప్రస్తుతం వెల్లడైన గణాంకాలు ప్రాథమిక ఫలితాలే. 95 శాతానికి పైగా ఓట్ల లెక్కింపు పూర్తయిన నేపథ్యంలో యునైటెడ్ రష్యా 355 స్థానాలను సాధించే పరిస్థితి ఏర్పడింది. తుది అధికారిక ఫలితాలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించాల్సి ఉంది. తాజా ఫలితాలతో రష్యా పార్లమెంటులో యునైటెడ్ రష్యా ఆధిపత్యం మరింత పెరగనుంది. 355 స్థానాలతో ఏర్పడనున్న కొత్త డ్యూమా పుతిన్ ప్రభుత్వానికి శాసనపరమైన స్థాయిలో బలమైన ఆధారాన్ని అందిస్తుంది. అదే సమయంలో ఉక్రెయిన్ యుద్ధం, ఆంక్షలు, పాశ్చాత్య దేశాలతో సంబంధాలు, దేశీయ ఆర్థిక పరిస్థితులు వంటి కీలక అంశాలపై కొత్త పార్లమెంట్ తీసుకునే నిర్ణయాలు అంతర్జాతీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.



# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సర్కార్ గుడ్‌న్యూస్

**హైదరాబాద్, మహా :** ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరై, ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. బేస్‌మెంట్ లేదా ఆ పైస్థాయిలో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు నిధుల విడుదలలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఎల్ 3 నుంచి ఎల్ 1కు మారుస్తూ 'వన్‌టైమ్ క్లియరెన్స్' (ఒక్కసారికి మాత్రమే ప్రత్యేక అనుమతి) ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ సడలింపు వల్ల ప్రభుత్వంపై పడే అదనపు ఆర్థిక భారాన్ని తామే భరిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే, అర్హులైన పేదలు నిబంధనల వల్ల ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇది కేవలం ఈ ఒక్కసారికి మాత్రమే వర్తిస్తుందని తేల్చిచెప్పారు. భవిష్యత్తులో ఎల్ 3 కేటగిరీ కింద మంజూరయ్యే ఇళ్లకు ఈ సడలింపును ప్రాతిపదికగా తీసుకోబోమని మంత్రి స్పష్టం చేశారు.

**నిర్మాణం మొదలుపెట్టకపోతే రద్దే**
ఇళ్లు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పునాది కూడా తీయని, నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులపై ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. అలాంటి వారి మంజూరును తక్షణమే రద్దు చేసి, ఆ ఇళ్లను అర్హులైన ఇతర నిరుపేదలకు కేటాయించాలని నిర్ణయించింది. ప్రభుత్వ అధికారిక వివరాల ప్రకారం.. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కొంత భూమి ఉండి శాశ్వత గృహం లేనివారు ఎల్ 1 కేటగిరీలోకి, భూమి, ఇల్లు ఏదీ లేని



నిరాశ్రయులు ఎల్ 2 కేటగిరీలోకి వస్తారు. వీరికి ఇళ్ల మంజూరులో అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటికే ఒక శాశ్వత ఇల్లు ఉన్నవారిని ఎల్ 3 కేటగిరీగా పరిగణిస్తారు. కొత్త ఇళ్ల మంజూరుకు వీరు అర్హులు కారు. పాత మంజూరులు రద్దు చేయడం ద్వారా వాస్తవంగా ఇల్లు అవసరమైన పేదలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**తొలిదశలో 4.50 లక్షల ఇళ్లు**
రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి దశ కింద రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిన విషయం తెలిసిందే. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

**నగరంలో ఇందిరమ్మ టవర్లు**
హైదరాబాద్ మహానగర పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మించనున్న ఈ టవర్లకు సంబంధించి సెప్టెంబర్ 21 నుంచి లబ్ధిదారులకు కేటాయింపు పత్రాలను అందజేస్తున్నట్లు హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా రాయదుర్గంలో సుమారు 2.85 ఎకరాల బోర్డు స్థలంలో 480 ఫ్లాట్లను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒక్కో ఫ్లాట్ 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టు కోసం వినియోగిస్తున్న భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.752 కోట్ల నుంచి రూ.767 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

### ప్రెసిడెంట్ ట్రంప్ వార్తలు ప్రసారం చేయం

**అమెరికాలో ప్రముఖ టీవీ చానెల్స్ ప్రకటన**

**మహా డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వార్తలు ప్రసారం చేయకూడదని నిర్ణయించుకున్నాయి అమెరికాలోని పలు కీలక టీవీ ఛానెళ్లు. సీఎన్ఎన్, ఎంఎస్ నౌ, పొలిటికో వంటి మీడియా సంస్థలకు వైట్ హౌస్‌లోకి ప్రవేశం నిషేధించిన క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నాయి. ప్రధాన టీవీ నెట్‌వర్కులు ఉమ్మడిగా వైట్ హౌస్ కవరేజ్‌ను నిలిపివేశాయి. దీంతో అధ్యక్షుడి ప్రజా కార్యక్రమాల వీడియోకు సంబంధించి కవరేజ్‌లో గ్యాప్ ఏర్పడింది. 2026 సెప్టెంబర్ 21న ఈ నిర్ణయాన్ని ప్రకటించాయి టీవీ చానెళ్లు. వైట్ హౌస్ టెలివిజన్ పూల్‌లో సీఎన్ఎన్ తనకున్న షెడ్యూల్ ప్రకారం వీడియో కవరేజ్ చేయడాన్ని నిరోధించడంతో టీవీ ఛానెళ్లు ఈ నిర్ణయానికి వచ్చాయి. ఫాక్స్ న్యూస్ మీడియా, ఏబీసీ న్యూస్, సీబీఎస్ న్యూస్, సీఎన్ఎన్, ఎన్‌బీసీ న్యూస్ కలిసి ఇకపై రొటేటింగ్ పూల్ కవరేజ్ అందించమని ప్రకటించాయి. ప్రజలకు ప్రభుత్వం గురించి ఖచ్చితమైన, స్వతంత్ర సమాచారం అందాలి. ఎలాంటి వార్తలు ఇవ్వాలి అనే కోణంలో వార్తా సంస్థను ప్రభుత్వాలు నియంత్రించకూడదు అని పేర్కొన్నారు. సాంప్రదాయకంగా ఈ ఐదు ప్రధాన టెలివిజన్ నెట్‌వర్కులు అమెరికా అధ్యక్షుడి కవరేజ్‌ను షేర్ చేసుకుంటాయి. అధ్యక్షుడి కార్యక్రమాలకు కెమెరా క్రూ పంపే బాధ్యతను వంతులవారీగా నిర్వహించి, ఆ ఫుటేజ్‌ను ఇతర బ్రాడ్‌కాస్టర్లకు పంపిణీ చేస్తాయి. 2026 సెప్టెంబర్ 21న సీఎన్ఎన్ పూల్ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంది. అందులో ట్రంప్ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ కోసం న్యూయార్క్ పర్యటన కవరేజ్ కూడా ఉంది. అయితే వైట్ హౌస్ ట్రంప్ విధించిన నిషేధాన్ని అమలు చేయడంతో సీఎన్ఎన్ ఆ అసైన్‌మెంట్‌ను నిర్వహించలేకపోయింది.



# రూ.813 కోట్లు వెంటనే చెల్లించండి

**కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు**

**హైదరాబాద్, మహా :** భూసేకరణ, పునరావాసం-పునర్వ్యవస్థీకరణకు ఇప్పటికే విడుదల చేసిన రూ.813 కోట్లను ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత రైతులకు అందించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం-పునర్వ్యవస్థీకరణ పనులు, పరిహారం చెల్లింపుల పురోగతిపై సోమవారం జిల్లా కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిధులు విడుదలైనప్పటికీ అవి ప్రభుత్వ ఖాతాల్లోనే ఉండిపోవడం.. మరోవైపు భూసేకరణ పూర్తికాక సాగునీటి ప్రాజెక్టులు నిలిచిపోవడం ఎంతమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు భూసేకరణ, పునరావాసం-పునర్వ్యవస్థీకరణకు సంబంధించి రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా.. ప్రభుత్వం రూ.2,504 కోట్లు విడుదల



చేసినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో చెల్లింపులకు పెండింగ్‌లో ఉన్న రూ.813 కోట్లలో రూ.502 కోట్లు భూసేకరణ అధికారుల వద్ద, మరో రూ.311 కోట్లు కలెక్టర్ల వద్ద ఉన్నట్లు తెలిపారు. ఈ పరిస్థితిపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు విడుదలైన తరువాత అవి తప్పనిసరిగా భూములు కోల్పోయిన రైతులకు చేరాలని స్పష్టం చేశారు. కలెక్టర్లు వ్యక్తిగతంగా చొరవ తీసుకొని రైతులతో సంప్రదింపులు జరపడంతోపాటు అవార్డుల ప్రక్రియను పూర్తి చేసి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం విడుదల చేసిన డబ్బు భూములు కోల్పోయిన రైతులకు చేరాల్సిందేనని.. ఏదైనా కారణంతో చెల్లించడం సాధ్యం కాకపోతే అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేసి నిధులను తిరిగి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. అంతేగానీ నెలల తరబడి ఖాతాల్లో నిరుపయోగంగా ఉంచడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులకు సంబంధించిన అవసరాల కోసం 2026లో రూ.6 వేల కోట్లు అందిస్తామని సీఎం హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు.

# రామ మందిరంలో భారీ కుంభకోణం

- 105 సార్లు విరాళాల చోరీ
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఇప్పటి వరకు 8 మంది అరెస్ట్
- సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలుకు ఏర్పాట్లు

**అయోధ్య, మహా :** అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

# గ్రామీణ చెరువులకు కొత్త రూపు

(మొదటి పేజీ తరువాయి)

పచ్చదనం, జెండా స్థూపం వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు.

**మైసమ్మ చెరువుకు మోడల్ రూపం**

ఫక్రుద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును గ్రామీణ చెరువుల అభివృద్ధికి నమూనా ప్రాజెక్టుగా తీర్చిదిద్దారు. చెరువు గట్టును బలోపేతం చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామస్తులు నడక సాగించేందుకు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. మహిళలు, యువత, వృద్ధులు వ్యాయామం చేసుకునేలా బహిరంగ వ్యాయామశాలను ఏర్పాటు చేశారు.

చిన్నారుల కోసం ప్రత్యేక ఉద్యానవనం

మైసమ్మ చెరువు పరిసరాల్లో చిన్నారుల కోసం ప్రత్యేకంగా పిల్లల ఉద్యానవనాన్ని అభివృద్ధి చేశారు. పవన్ కల్యాణ్ చిన్నారులతో కలిసి ఈ ఉద్యానవనాన్ని ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించారు. ఉద్యానవనంలో ఆడుకుంటున్న చిన్నారులను పలకరించి వారికి తినుబండారాలు, చాక్లెట్లు అందించారు.

**పిఠాపురంలో 11 చెరువులకు అభివృద్ధి**

పిఠాపురం నియోజకవర్గ పరిధిలో మొత్తం 11 చెరువులను సుమారు రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ చెరువులకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. చెరువుల అభివృద్ధి ద్వారా నీటి వనరుల పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా 105 చెరువులు**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.50 కోట్ల వ్యయంతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. వీటిలో సగానికి పైగా పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. సెప్టెంబర్ నెలాఖరులోగా అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**చెరువులు ఇక సామాజిక వేదికలుగా**

చెరువులను కేవలం సాగునీటి వనరులుగా చూడకుండా వాటి చుట్టూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సౌకర్యాలను కల్పించాలన్న



ఆలోచన ఈ ప్రాజెక్టులో కనిపిస్తోంది. నడక మార్గాలు, వ్యాయామ సదుపాయాలు, పిల్లల ఉద్యానవనాలు, పచ్చదనం వంటి అంశాలను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ ప్రజలకు స్థానికంగానే ఆరోగ్యకరమైన విశ్రాంతి ప్రదేశాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

**చెరువుల గ్యాలరీ పరిశీలన**

కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువులకు సంబంధించిన చిత్ర ప్రదర్శనను పవన్ కల్యాణ్ పరిశీలించారు. మైసమ్మ చెరువు గట్టు వెంబడి నడుస్తూ అక్కడ ఉన్న వృక్షాలు, మొక్కల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుల సుందరీకరణలో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి.

**మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

చెరువు ప్రారంభోత్సవానికి ముందు పవన్ కల్యాణ్ చెరువు గట్టుపై ఉన్న మైసమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువు మధ్య ప్రాంతంలో నిర్మిస్తున్న నందీశ్వరుడితో కూడిన శివుని విగ్రహ నిర్మాణాన్ని కూడా పరిశీలించారు.

**ప్రజలతో నేరుగా మమేకం**

మైసమ్మ చెరువు ప్రారంభోత్సవానికి వచ్చిన స్థానిక ప్రజలను పవన్ కల్యాణ్ పలకరించారు. వారి నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. అనంతరం గ్రామ సచివాలయం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి తడి చెత్త, పొడి చెత్త నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**పిఠికాపుర వనానికి మరో హరిత రూపం**

పిఠాపురం పట్టణంలో మరోవైపు 'పిఠికాపుర వనం' పేరుతో నగర వనాన్ని కూడా ప్రారంభించారు. గతంలో చెత్తను పారబోసే ప్రాంతంగా ఉన్న స్థలాన్ని హరిత ప్రదేశంగా అభివృద్ధి చేసినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. సుమారు రూ.1.83 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ నగర వనంలో సీతాకోకచిలుకల ఉద్యానవనం, బహిరంగ వ్యాయామశాల, నడక మార్గాలు, ప్రత్యేక వనాలు, కొలను వంటి సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం.

**27 నక్షత్ర వనంతో ప్రత్యేక ఆకర్షణ**

పిఠికాపుర వనంలో 27 నక్షత్రాలకు ప్రతీకగా వివిధ రకాల మొక్కలను నాటినట్లు నివేదికలు తెలిపాయి. మియావాకీ పద్ధతిలో ప్రత్యేక అటవీ ప్రాంతాన్ని, సీతాకోకచిలుకల ఉద్యానవనాన్ని కూడా అభివృద్ధి చేశారు. పిఠాపురం ప్రజలతో పాటు ఆధ్యాత్మిక పర్యటనలకు వచ్చే సందర్శకులకు ఈ ప్రాంతం ఆహ్లాదాన్ని అందించేలా మరింత అభివృద్ధి చేయాలని పవన్ కల్యాణ్ అధికారులకు సూచించినట్లు సమాచారం.

**చెరువు నుంచి ప్రజా ఆరోగ్య కేంద్రం దిశగా**

పిఠాపురంలో చేపట్టిన చెరువుల అభివృద్ధి కార్యక్రమంలో నీటి వనరుల పరిరక్షణతో పాటు ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. నడక, వ్యాయామం, పిల్లల ఆటలు, పచ్చదనం వంటి సదుపాయాలను చెరువు పరిసరాల్లోనే ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్థానికంగానే వినోదం, విశ్రాంతి, శారీరక చురుకుదనం కోసం వేదికలు అందుబాటులోకి వస్తున్నాయి. మైసమ్మ చెరువు ఈ విధానానికి నమూనాగా నిలపాలన్నది కార్యక్రమం ఉద్దేశంగా అధికారులు వివరించారు.

**అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ**

పిఠాపురం నియోజకవర్గంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని పవన్ కల్యాణ్ ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు గత వారం నివేదికలు వెల్లడించాయి. సెప్టెంబర్ 11న నిర్వహించిన సమీక్షలో పెండింగ్ పనులను గుర్తించి అవసరమైన పరిపాలనా, సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి నిర్ణీత గడువులో పనులు పూర్తిచేయాలని ఆయన సూచించారు.

## డీఎస్సీపై చర్చిద్దాం
# దమ్ముంటే అసెంబ్లీకి రండి

- వైసీపీకి సీఎం చంద్రబాబు ఛాలెంజ్
- కుప్పం సభలో వైసీపీపై విరుచుకుపడ్డ సీఎం
- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడులపై ఆగ్రహం



**కుప్పం, మహా :** డీఎస్సీపై వైసీపీ చేస్తున్నవన్నీ తప్పుడు ఆరోపణలేనని, నిజంగా చర్చించాలన్న చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సీఎం చంద్రబాబునాయుడు జగన్ కు సవాల్ విసిరారు. చిత్తూరు జిల్లా కుప్పం బహిరంగ సభలో మాట్లాడిన చంద్రబాబు వైఎస్సార్‌సీపీ వైఖరిపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. తన హయాంలో 14 డీఎస్సీలు నిర్వహించి టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. మెగా డీఎస్సీపై ఆరోపణలకు బదులుగా, దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ఛాలెంజ్ చేశారు. విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద స్వశక్తితో, ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ శ్రేణులు, గొడ్డలి పార్టీ రౌడీలు దాడులకు తెగబడటాన్ని తీవ్రంగా ఖండించారు. గురువులపై దాడులు చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. టీచర్ల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి, రౌడీయిజం చేసేవారి తోక కత్తిరిస్తామని సీఎం గట్టిగా హెచ్చరించారు. నాటి పాలనలో పాలకులే రౌడీయిజం చేశారని, చంపడానికి, చావడానికి సిద్ధమని వైసిపి ఎమ్మెల్సీ మాట్లాడటంపై మండిపడ్డారు. మిమ్మల్ని చంపడానికి ఇక్కడ ఎవరూ సిద్ధంగా లేరు, మీరు కూడా చావొద్దు. నేరస్థులకు ఇది ప్లేస్ కాదు, మంచివాళ్లు ఉండే అడ్డా అని.. హద్దుమీరితే ప్రజలే తరిమికొడతారని స్పష్టం చేశారు.

**చంద్రబాబు అంటే లీకేజీలు ఉండవు..**

మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు కావాలనే పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, సీబీఎన్ హయాంలో నిర్వహించే ఏ పరీక్షలోనూ అవినీతికి గానీ, పేపర్ లీకేజీలకు గానీ తావుండదని చంద్రబాబు తేల్చిచెప్పారు. తన 17 ఏళ్ల పాలనలో 14 సార్లు పారదర్శకంగా డీఎస్సీలు నిర్వహించి లక్షలాది మందికి ఉద్యోగాలు ఇచ్చానని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం రాగానే తొలి సంతకంతో మెగా డీఎస్సీ తెచ్చి 16,000 పైగా టీచర్ పోస్టులను భర్తీ చేస్తే, కోర్టుల్లో 350కి పైగా పిటిషన్లు వేసి అడ్డుకోవాలని చూశారని విమర్శించారు. చట్టబద్ధమైన నియామక ప్రక్రియ ముగిసిన ఏడాది తర్వాత బురద చల్లడం దారుణమన్నారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని, సాక్ష్యాధారాలతో సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు సవాల్ విసిరారు. వైసీపీ హయాంలో క్రీడలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చి, ఇప్పుడు తమ ప్రభుత్వంలో అవే సర్టిఫికెట్లతో ఉద్యోగాలు వస్తే ఫేక్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. చివరకు ఆర్మీలో పనిచేసి కుప్పంలో టీచర్‌గా ఎంపికైన ఒక మాజీ సైనికుడిని స్కూలు నుంచి బయటకు పిలిచి ఓ ఛానల్ రిపోర్టర్ అవమానించడాన్ని ఎండగట్టారు. టీచర్లను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, రౌడీయిజం, సైకో సంస్కృతికి కుప్పం గడ్డపై స్థానం లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు. గొడ్డలి పార్టీ నాయకులకు క్రమంగా మైకం, పూనకాలు వస్తున్నాయని.. అయితే వారి బెదిరింపులు లేదా అవాకులు చవాకులు తమ వద్ద సాగవని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న పారదర్శక నియామకాలపై అబద్ధాలు ప్రచారం చేయడం మాని, ధైర్యముంటే గత వైసీపీ ప్రభుత్వంలో సాగిన 'జే బ్రాండ్ల' మద్యం దందాపై, ఏపీపీఎస్సీ నియామకాల్లో జరిగిన తీవ్ర అక్రమాలపై అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి కేవలం 11 స్థానాలు మాత్రమే కట్టబెట్టి, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారని చంద్రబాబు ఎద్దేవా చేశారు. ఆ పార్టీ అనుసరిస్తున్న విధ్వంసకర రాజకీయాలకు, దాడులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి ఒక్క సీటు కూడా రాకుండా ప్రజలు తిరస్కరించినప్పుడే వారి ఆరోపణలకు సరైన, నిజమైన సమాధానం లభిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఎన్నికలు జరగని గ్రామపంచాయతీలకు నిధులు

- 58 గ్రామ పంచాయతీలకు రూ.33.62 కోట్లు విడుదల
- మంత్రి సీతక్క చొరవతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

**హైదరాబాద్, మహా :** కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల గ్రామపంచాయతీ ఎన్నికలు జరగని 58 గ్రామ పంచాయతీలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఎన్నికలు జరగలేదన్న కారణంతో నిలిచిపోయిన కేంద్ర ఆర్థిక సంఘం నిధుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది. గ్రామపంచాయతీ ఎన్నికలు జరగకపోవడం ఆయా గ్రామాల అభివృద్ధికి అడ్డంకిగా మారకూడదన్న ఉద్దేశంతో మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి గ్రామపంచాయతీల తప్పు కాదని, అందువల్ల అభివృద్ధి నిధులు నిలిచిపోవడం వల్ల ప్రజలు నష్టపోకూడదని మంత్రి సీతక్క ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సీతక్క చొరవతో రాష్ట్ర ఆర్థిక శాఖ 58 గ్రామపంచాయతీలకు మొత్తం రూ.33,62,9000 నిధులను విడుదల చేసింది. విడుదలైన నిధులు ఆయా గ్రామపంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి. ఎన్నికలు జరగలేదన్న కారణంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు అందకపోయినా, గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా నిధులు సమకూర్చింది. గ్రామపంచాయతీల పరిస్థితికి ఎన్నికలు జరగకపోవడం కారణం కాకూడదు.. ప్రజల అభివృద్ధి ఆగకూడదు అన్న ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 58 గ్రామపంచాయతీలకు ప్రయోజనం కలగనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఆయా గ్రామ పంచాయతీలకు తన వాటాను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు చేశారు.

# భారత్‌కెనడా బంధంలో కొత్త అధ్యాయం

- మోదీ–కార్నీ భేటీలతో ద్వైపాక్షిక సంబంధాల్లో సానుకూల మార్పు.

ఢిల్లీ, మహా : కొంతకాలంగా దౌత్యపరమైన విభేదాలతో వార్తల్లో నిలిచిన భారత్-కెనడా సంబంధాలు 2026లో కొత్త దిశగా సాగుతున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ మధ్య జరిగిన ఉన్నతస్థాయి చర్చల అనంతరం వాణిజ్యం, ఇంధనం, సాంకేతికత, ప్రతిభా మార్పిడి, కృత్రిమ మేధస్సు, రక్షణ, సరఫరా వ్యవస్థలు వంటి రంగాల్లో సహకారాన్ని పెంచేందుకు ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయి. కెనడా ప్రభుత్వం స్వయంగా ద్వైపాక్షిక సంబంధాల్లో సానుకూల ఊపు కొనసాగుతోందని పేర్కొంది.

**విభేదాల నుంచి సహకారం వైపు**

భారత్, కెనడా మధ్య గతంలో దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ 2026లో ఇరు దేశాల ప్రభుత్వాలు సంబంధాలను పునరుద్ధరించే దిశగా చర్యలు చేపట్టాయి. మార్చి 2026లో కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత్‌లో పర్యటించి నరేంద్ర మోదీతో విస్తృత చర్చలు జరిపారు. ఇంధనం, ప్రతిభ, సాంకేతికత, కృత్రిమ మేధస్సు రంగాల్లో కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి.

**మోదీ-కార్నీ భేటీతో వేగం**

జూన్ 16న ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా మోదీ, కార్నీ మరోసారి సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల్లో కొనసాగుతున్న సానుకూల పరిణామాలను ఇరువురు నేతలు స్వాగతించారు. వాణిజ్యం, ఇంధనం, ఆహార భద్రత, సరఫరా వ్యవస్థల స్థిరత్వం వంటి అంశాలపై సహకారాన్ని మరింత పెంచాలని నిర్ణయించారు. కెనడా ప్రధాని కార్యాలయం ఈ సమావేశాన్ని సంబంధాల పురోగతిలో మరో ముందడుగుగా పేర్కొంది.

**వ్యూహాత్మక భాగస్వామ్యానికి బాట**

భారత్-కెనడా సంబంధాలను భవిష్యత్ దిశగా తీసుకెళ్లేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. కెనడా ప్రధాని కార్యాలయం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఇరు దేశాలు ప్రజాస్వామ్య విలువలు, సార్వభౌమత్వం, చట్టబద్ధ పాలనకు గౌరవం వంటి అంశాలను సంబంధాలకు పునాదులుగా పేర్కొన్నాయి. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో బలమైన, స్థిరమైన భాగస్వామ్యం ఇరు దేశాలకు ప్రయోజనకరమని తెలిపాయి.

**వాణిజ్య ఒప్పందంపై చర్చలు**

ఇరు దేశాల సంబంధాల్లో ప్రస్తుతం అత్యంత కీలకమైన అంశాల్లో ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం ఒకటి. ఈ ఒప్పందంపై చర్చలను వేగవంతం చేసి 2026లోనే ముగించాలన్న లక్ష్యాన్ని ఇరు దేశాలు ప్రకటించాయి. సెప్టెంబర్ 17న కెనడా అంతర్జాతీయ వాణిజ్య మంత్రి మానిందర్ సిద్ధూ భారత్ పర్యటించి భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌తో చర్చలు జరిపారు.

**అక్టోబర్‌లో మరో దఫా చర్చలు**

భారత్, కెనడా మధ్య ప్రతిపాదిత సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై తదుపరి విడత చర్చలు అక్టోబర్ 5 నుంచి ప్రారంభం కానున్నట్లు తాజా సమాచారం వెల్లడించింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కీలక ఖనిజాలు వంటి రంగాలు ఈ చర్చల్లో ప్రాధాన్యం పొందుతున్నాయి. 2026 చివరి నాటికి ఒప్పందాన్ని పూర్తి చేయగలమన్న ఆశాభావాన్ని కెనడా వాణిజ్య మంత్రి వ్యక్తం చేశారు.

# ఆ వందల ఎకరాల్లో మా వాటా ఎక్కడ

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డంగా దోచుకుంది
- కేటీఆర్ కు సంతోశ్ రావు బినామీ
- చెప్పులు కూడా లేని సంతోశ్ రావుకు వందల ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయి
- కాంగ్రెస్ నేత రమ్యారావు



హైదరాబాద్, మహా : రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు పారదర్శకమైన ప్రజా పాలన అందిస్తుంటే, ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు 22ఏ పేరిట రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకురాలు, కేసీఆర్ సొంత అన్న కూతురు రమ్యారావు మండిపడ్డారు. గాంధీ భవన్ లో ఏర్పాటు చసిమ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా ఆస్తులు దోచుకుందని ధ్వజమెత్తారు. గతంలోనే తమకు వందల ఎకరాల భూములు ఉన్నాయని ప్రకటనలు చేస్తున్న కేటీఆర్.. అందులో మా వాటా ఎక్కడుందో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోశ్ రావు కేటీఆర్‌కు బినామీ కాబట్టే ఆయన ఆస్తులపై ప్రశ్నించకుండా మౌనంగా ఉంటున్నారా? అని ప్రశ్నించారు. గతంలో చెప్పులు వేసుకునే పరిస్థితి కూడా లేని సంతోశ్ రావుకు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో భవనం, కొండాపూర్, మార్కుక్ ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు, నానక్‌రామ్‌గూడలో ఆయన భార్య రోహిణి పేరిట భారీ కమర్షియల్ భవనాలు ఎలా వచ్చాయని నిలదీశారు. ప్రాజెక్టుల ముంపు పేరుతో కుదురుపాక గ్రామానికి సంబంధం లేని సంతోష్ కుటుంబ సభ్యులు అక్రమంగా 8 ఇళ్ల ప్లాట్లను పొందారని, అయితే 2018 రాజ్యసభ అఫిడవిట్‌లో కేవలం ఒక్క ప్లాట్‌ను మాత్రమే చూపి సమాచారాన్ని దాచారని ఆరోపించారు. కేసీఆర్ దగ్గర ఉంటూ అడ్డగోలుగా సంపాదించిన సంతోష్ రావును వెనకేసుకొస్తూ కవితను, ఇంటి నుంచి బయటకు పంపిన వైనంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని రమ్యారావు సవాల్ విసిరారు. ఫాంహౌస్ లలో కూర్చుని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం వేల కోట్లను కొల్లగొట్టిందని ఆరోపించారు. టీపీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ఈ అక్రమాలు, కబ్జాలపై పోరాటం చేస్తే అక్రమ కేసులు పెట్టి వేధించారని విమర్శించారు. సీబీఐ, ఈడీ, దర్యాప్తు సంస్థలకు దొరకకుండా కేసీఆర్ ఫ్యామిలీ చేసిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడతాయని పేర్కొన్నారు. 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు టర్మ్స్ పాలనలో చేసిన అవినీతి, అక్రమాలు, అన్యాయాలపై పోరాటం చేస్తూనే ఉన్నాం. సోనియా గాంధీ ఎన్నో ఆశలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే కేసీఆర్ ఫ్యామిలీ ఇష్టరీతిన దోచుకుందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబం చేసిన వందల ఎకరాల దోపిడీపై రాష్ట్ర ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. అప్పట్లో తమ కల్వకుంట్ల ఫ్యామిలీకి వందల ఎకరాలు ఉండేవని, నా పెళ్లి, కేటీఆర్ పెళ్లి అయ్యేవరకు మా ఆస్తులు పది ఎకరాలు లేని పరిస్థితి వచ్చిందన్నారు. మా తాత పేరు రాఘవరావు. ఆయన ఇద్దరు కుమారులు రంగారావు, చంద్రశేఖరరావు. కేటీఆర్ చెప్పిందే నిజమనుకుంటే కేసీఆర్ ఫ్యామిలీకి వందల ఎకరాలు ఉంటే మాకు కూడా వందల ఎకరాలు ఉండాలి. కేటీఆర్ గుంటూరులో చదువుకుంటే, నేను కరీంనగర్ లో చదివా. మాకు లేని ఆస్తులు మీ వద్ద ఎలా ఉన్నాయి. మా నాన్నకు ఆరోగ్యం బాగోలేనప్పుడు ఆస్తుల్ని ఏం చేశారని తెలంగాణ ఆడబిడ్డగా అడుగుతున్నాను అని అన్నారు. ఉద్యమం సమయంలో సంబంధం లేదన్న సంతోష్ ఇప్పుడు ఎలా దగ్గరయ్యాడు. ఇన్ని తప్పులు జరుగుతుంటే మౌనంగా ఉండటంలో ఆశ్చర్యం ఏముంది. అవినీతిలో సంబంధం లేదంటే సంతోష్ ను ఎందుకు పక్కన పెట్టుకున్నారు. సంతోష్ ఎన్నో భూములు దోచుకున్నాడు. అఫిడవిట్ లో లేని ఆస్తులు, గత ప్రభుత్వంలో ఎలా వచ్చాయి. బినామీలు, భూముల రూపంలో ఎన్నో ఆస్తులున్నాయి. సంతోష్ సోదరికి వివాహం అయ్యాక కూడా జోగినపల్లి సౌమ్య పేరిట సైతం భూములు ఉన్నాయని ఆరోపించారు. సంతోష్ రావు అవినీతి, అక్రమాలపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తూ, ఆయనకు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. గతంలో కరీంనగర్‌లో ఉన్నప్పుడు కనీసం సరైన వసతులు కూడా లేని సంతోష్ రావుకు, ఈరోజు ఇన్ని వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. సంతోష్ రావుకు మార్కుక్ గ్రామంలో 9 ఎకరాల భూమితో పాటు బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14, కొండాపూర్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో ఆస్తులు మరియు నివాసాలు ఎలా వచ్చాయని ఆమె ప్రశ్నించారు. అంతేకాకుండా, ఆయన భార్య రోహిణి పేరిట నానక్‌రామ్‌గూడలో భారీ కమర్షియల్ భవనాలు ఏ విధంగా వెలిశాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత అక్కాచెల్లెళ్లను పక్కనబెట్టి, అనేక ఆరోపణలు ఉన్న సంతోష్ రావును కేసీఆర్ కుటుంబం ఎందుకు దగ్గరకు తీసిందో, ఆయన చేసిన అక్రమాలు తెలిసీ కేటీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని రమ్యా రావు డిమాండ్ చేశారు.

# ఎంజీఎం ఆసుపత్రికి అనారోగ్యం

## వెంటిలేటర్ పై పెద్ద ఆసుపత్రి

- ఆరోగ్య శ్రీ వార్డులో పై కప్పు కూలి రోగులకు గాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు
- బీజేపీ నేతలను అడ్డుకున్న పోలీసులతో వాగ్వివాదం
- ఆరోగ్యశాఖను గాలికొదిలేసిన మంత్రి రాజీనామా చేయాలి




**వరంగల్, బ్యూరో మహా ;** ఉత్తర తెలంగాణకే తలమానికమైన, వరంగల్ నగరంలోని ప్రభుత్వ పెద్ద ఆసుపత్రి అయిన ఎంజీఎం ఆసుపత్రి కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం వల్ల ఇప్పుడు తీవ్ర అనారోగ్యంతో వెండి లెటర్ పై ఉందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఆదివారం ఎంజీఎం ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డులో అకస్మాత్తుగా ఆస్పత్రి పైకప్పు పెచ్చులు ఊడిపడి, చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే.ఈ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తో పాటు బీజేపీ నాయకులు ఎంజీఎం ఆసుపత్రికి చేరగా, ఆసుపత్రి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకోవాలని చూసిన పోలీసుల తో బీజేపీ నాయకులతో తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసుల ఆంక్షలను ధిక్కరిస్తూ బీజేపీ శ్రేణులు నిన్న ప్రమాదం జరిగిన ఆరోగ్యశ్రీ వార్డు ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడి వాతావరణంలో రోగులు పడుతున్న ఇబ్బందులను, భవన శిథిలావస్థను చూసి నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ కు కమిషన్ల పై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పై లేదా**

అనంతరం జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పై, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పై నిప్పులు చెరిగారు. స్థానిక కాంగ్రెస్ మంత్రులకు, ఎమ్మెల్యేలకు కేవలం వారి పదవులు , కమిషన్ల పై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై, ప్రజల ప్రాణాల పై అస్సలు లేదని మండిపడ్డారు. నిరుపేద ప్రజలకు అత్యాధునిక ఉచిత వైద్యం అందించాల్సిన ఆరోగ్య శ్రీ వార్డులోనే పై కప్పు కూలి రోగుల ప్రాణాల మీదకు రావడం అధికారుల, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. రోగాలను కాపాడాల్సిన ఆసుపత్రే వెంటిలేటర్ పై ఉంది.ప్రజలను రోగాల బారి నుండి కాపాడాల్సిన ఎంజీఎం ఆసుపత్రి, సోమవారం అధికారుల నిర్లక్ష్యం వల్ల తానే వెంటిలేటర్ పై ఉన్న దుస్థితికి చేరింది. కనీస మౌలిక వసతులు ఈ ఆసుపత్రిని చూసి వరంగల్ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు అని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రోగులను కాపాడలేకపోతున్నఇటువంటి నిర్లక్ష్యపు అధికారుల పై వైద్య శాఖ పై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గాయపడిన బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యంతో పాటు తగిన నష్టపరిహారం అందించాలని, ఆరోగ్యశాఖను గాలికొదిలేసిన ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల పై, వైద్య రంగంలో వారి వైఫల్యాల పై బీజేపీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గంట రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శులు గోకే వెంకటేష్, వెంకట్ రావు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# రష్యాలో పుతిన్ ప్రభంజనం



మానవ చరిత్ర గమనాన్ని మలుపు తిప్పి, దోపిడీలేని సమసమాజ స్థాపనే లక్ష్యంగా శ్రామికవర్గాన్ని ఏకం చేసిన ఎర్రజెండా నేడు ప్రపంచవ్యాప్తంగా తన ఉనికిని కాపాడుకునేందుకు తీవ్రంగా ఆరాటపడుతోంది. ఇరవయ్యో శతాబ్దపు రాజకీయ యవనికను శాసించి, సామ్రాజ్యవాద శక్తులకు సింహస్వప్నంగా నిలిచిన మార్క్సిస్టు సిద్ధాంతం.. ఇరవై ఒకటో శతాబ్దపు మూడో దశాబ్దానికి వచ్చేసరికి తీవ్ర సైద్ధాంతిక, సంస్థాగత సంక్షోభంలో కూరుకుపోయింది. లెనిన్, స్టాలిన్ల గడ్డ రష్యా మొదలుకొని భారతదేశం వరకు, యూరప్ నుంచి లాటిన్ అమెరికా వరకు కమ్యూనిస్టు పార్టీల ప్రాభవం క్రమంగా మసకబారుతోంది. ఒకప్పుడు ప్రపంచ జనాభాలో మూడో వంతును ప్రభావితం చేసిన ఈ సిద్ధాంతం, నేడు ఓటర్ల మదిని గెలవలేక ఎందుకు వెనుకబడుతోంది? ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలను ఆకర్షించే సరికొత్త రాజకీయ భాషను నిర్మించుకోవడంలో ఎక్కడ విఫలమవుతోంది? అన్న ప్రశ్నలు ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులను తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి. బోల్షెవిక్ విప్లవానికి జన్మనిచ్చి ప్రపంచ విప్లవాలకు కేంద్ర బిందువుగా నిలిచిన రష్యాలోనే కమ్యూనిస్టు పార్టీ తీవ్ర పతనాన్ని చవిచూస్తోంది. సోవియట్ యూనియన్ పతనానంతరం 1995 నాటి రష్యా పార్లమెంట్ (స్టేట్ డ్యూమా) ఎన్నికల్లో కమ్యూనిస్టులు ఏకంగా 157 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద రాజకీయ శక్తిగా నిలిచారు. అయితే, వ్లాదిమిర్ పుతిన్ నాయకత్వంలోని యునైటెడ్ రష్యా పార్టీ ఆధిపత్యం పెరిగేకొద్దీ కమ్యూనిస్టుల ప్రభావం నామమాత్రంగా మారింది. తాజా ఎన్నికల్లో యునైటెడ్ రష్యా 355 స్థానాలతో రికార్డు విజయం సాధించగా, కమ్యూనిస్టులు కేవలం 40 స్థానాలకే పరిమితం కావడం వారి దీర్ఘకాలిక క్షీణతకు నిదర్శనం. యువతను ఆకర్షించే ఆధునిక సామాజికఆర్థిక ఎజెండా లేకపోవడం, దశాబ్దాలుగా పాతతరం నాయకుల చేతుల్లోనే పార్టీ బందీ కావడం, పుతిన్ రాజ్యంలో పెరుగుతున్న జాతీయవాద ప్రవాహాన్ని తట్టుకోలేకపోవడమే మాస్కోలో కమ్యూనిస్టుల తిరోగమనానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

భారతదేశంలో పరిమితమైన ప్రాభవం

భారత రాజకీయ యవనికపై శ్రామిక, కార్మిక, కర్షక ఉద్యమాల ద్వారా బలమైన ముద్ర వేసిన వామపక్షాలు నేడు అసాధారణ రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మూడు దశాబ్దాలకు పైగా నిరాటంకంగా పాలించిన పశ్చిమ బెంగాల్‌లో, సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న త్రిపురలో వామపక్షాలు అధికారాన్ని కోల్పోవడమే కాకుండా, శాసనసభల్లో సైతం ప్రాతినిధ్యం కోసం పోరాడాల్సిన దుస్థితికి చేరాయి. 2004 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ తదితర వామపక్షాలు రికార్డు స్థాయిలో 60కి పైగా ఎంపీ స్థానాలను గెలుచుకుని కేంద్రంలో యూపీఏ 1 ప్రభుత్వ మనుగడకు అత్యంత కీలకంగా మారాయి. అయితే ఆ గరిష్ఠ స్థాయి నుంచి 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికలకు వచ్చేసరికి లోక్‌సభలో వామపక్షాల సంఖ్య వేళ్లమీద లెక్కపెట్టే స్థాయికి పడిపోయింది. ప్రస్తుతం కేరళ మాత్రమే వామపక్షాలకు బలమైన రాజకీయ కోటగా మిగిలి ఉంది. భారత్‌లో వామపక్షాల క్షీణతకు కేవలం రాజకీయ ఓటములు మాత్రమే కారణం కాదు.. శతాబ్దాలుగా వేళ్లూనుకున్న కుల వ్యవస్థ సంక్లిష్టతలను, అట్టడుగు వర్గాల సామాజిక ఆకాంక్షలను కేవలం ఆర్థిక కోణంలోనే విశ్లేషించే మూస వైఖరి పార్టీలను దెబ్బతీసింది. ఆర్థిక సరళీకరణ తర్వాత దేశంలో పెరిగిన మధ్యతరగతి ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో, సాంకేతిక విప్లవం తెచ్చిన మార్పులకు అనుగుణంగా ఉద్యమ రూపాలను మార్చడంలో భారత కమ్యూనిస్టులు తీవ్ర జాప్యం చేశారు. సంస్థాగతంగా యువ నాయకత్వాన్ని ప్రోత్సహించకపోవడం, ఓటర్లను ఆకట్టుకునే ఆచరణాత్మక వ్యూహాల లేమి వెరసి జాతీయ రాజకీయాల్లో వామపక్షాల పాత్రను అంచులకు నెట్టివేశాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే సాంప్రదాయ మార్క్సిస్టులెనినిస్ట్ భావజాలం చాలావరకు తన ప్రాబల్యాన్ని కోల్పోయింది. చైనా అధికారికంగా కమ్యూనిస్టు పార్టీ పాలనలోనే కొనసాగుతున్నప్పటికీ, దాని ఆర్థిక విధానాలు మార్కెట్ సోషలిజం పేరిట పూర్తి పెట్టుబడిదారీ ఆర్థిక సూత్రాలతో ముడిపడి ఉన్నాయి. ఉత్తర కొరియా కమ్యూనిజం స్థానంలో వంశపారంపర్య నియంతృత్వ 'జుచే' సిద్ధాంతాన్ని అమలు చేస్తుండగా, వియత్నాం సైతం 'దోయ్ మోయ్' సంస్కరణలతో ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో భాగస్వామిగా మారింది. క్యూబా తీవ్ర ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటూ మనుగడ కోసం ఆరాటపడుతోంది. యూరప్‌లో ఒకప్పుడు ప్రభావం చూపిన ఇటలీ, ఫ్రాన్స్ వంటి దేశాల కమ్యూనిస్టు పార్టీలు నేడు చరిత్ర పుటలకే పరిమితమయ్యాయి. లాటిన్ అమెరికాలో అప్పుడప్పుడు 'పింక్ టైడ్' (వామపక్ష మొగ్గు కలిగిన ప్రభుత్వాలు) అధికారంలోకి వస్తున్నప్పటికీ, అవి సాంప్రదాయ కమ్యూనిస్టు భావజాలం కంటే ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య సోషలిజం ఆధారంగానే మనుగడ సాగిస్తున్నాయి. సాంప్రదాయ శ్రామికవర్గ నిర్వచనాలు మారిపోయి, గిగ్ ఎకానమీ, సర్వీస్ సెక్టార్, కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న వేళ.. పాత పారిశ్రామిక విప్లవ కాలం నాటి నినాదాలు ఓటర్లను ప్రభావితం చేయలేకపోతున్నాయి.అసమానతలు పెరిగిపోతున్న ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజానుకూల వామపక్ష భావజాలం, ప్రశ్నించే ప్రతిపక్ష స్వరం ఎంతో అవసరమనేది నిర్వివాదాంశం. కార్మిక హక్కులు, ప్రజారోగ్యం, ఉచిత విద్య, సామాజిక భద్రత వంటి అంశాల్లో కమ్యూనిస్టు ఉద్యమాలు సాధించిన చారిత్రక విజయాలు ఎవరూ కాదనలేనివి. కానీ, సిద్ధాంతం పుస్తకాలకే పరిమితమై, ఆచరణ జనజీవన స్రవంతికి దూరమైనప్పుడు రాజకీయ పతనం అనివార్యమవుతుంది. ఎర్రజెండా మళ్లీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలంటే.. సోవియట్ కాలం నాటి మూస ఆలోచనల నుంచి బయటకు వచ్చి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే కేంద్రంగా సరికొత్త విధానాలను రూపొందించుకోవాలి. ఆధునిక యువత ఆలోచనలకు తగినట్లుగా డిజిటల్ శకపు సవాళ్లను స్వీకరించి, పర్యావరణ సంక్షోభం, ఆర్థిక అసమానతలు, సామాజిక వివక్షలపై స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించగలగాలి. పాత నినాదాలు, వృద్ధ నాయకత్వ చట్రాలను బద్దలుకొట్టి వర్తమాన వాస్తవాలకు అనుగుణంగా మారినప్పుడే ఎర్రజెండాకు ప్రజాస్వామ్య వ్యవస్థల్లో భవిష్యత్తు సాధ్యమవుతుంది.

**గడల నరసింహారావు.**
**మహా పత్రిక అసోసియేట్ ఎడిటర్**

# గురువే మూలం

మనమందరం గురు పూజోత్సవం నాడే కాదు గురువును నిత్యం స్మరిస్తూవుండాలి. మనం ఇంతటి వారు కావడానికి వారు పడిన శ్రమ అనన్య సామాన్యం. గురువు లేనిదే ఏ విద్య కూడా శోభించదు. ఒక్క చదువులోనే కాకుండా వివిధ క్రీడలలో, అంశలలో తర్ఫీదు ఇచ్చే గురువులను ఎన్నడూ మరువరాదు. చరిత్రలో గురువు స్థానం చాలా గొప్పది.ఆనాడు పిల్లలకు గురువు అంటే ఎనలేని భక్తి ప్రపత్తులు, భయం, గౌరవం ఉండేవి. వారు ఎదురు పడితే దాక్కొనే వాళ్ళు. వాళ్ళేమి రాక్షసులు కాదు. అదొక భక్తి మాత్రమే. కానీ ఈరోజుల్లో గురువు స్థానం మారింది. అరే అంటే ఓరే అనే స్థాయికి విద్యార్థులు వచ్చారు. పిల్లలకు అనుగుణంగానే నేడు విద్య ను భోదించాలి. రాను, రాను పిల్లలకు గురువు అంటే ఓ జోకర్ గా, హేళనగా కనిపిస్తున్నాడు. దీనికి తోడు చలన చిత్రాలలో, వివిధ ప్రసార మాద్యమాలలో గురువు స్థానం ను భ్రష్టు పట్టిస్తున్నారు. ఎవో కొన్నిటిలో గురువును గొప్పగా చిత్రికరిస్తున్నారు కానీ చాలా వరకు గురువు స్థానం ఘోరం. గురువులు కూడా అందరూ మంచి వాళ్ళే ఉండరు. కొందరు బాలికలను లైంగి కంగా వేదించడం, వాళ్ళను వశపరచు కోవడం, దేహ శుద్ధి చేయించుకోవడం చూస్తున్నదే. ఎందుకు గురువు ఇలా మారుతున్నాడో తెలియడం లేదు. పిల్లల ముందు మందు కొట్టడం, గురక పెట్టి నిద్ర పోవడం, వివిధ పనులకు వారిని పుర మా యించడం, వారు కాదంటే అసభ్య పదాలతో తిట్టడం, కొట్టడం చేస్తున్నారు. గురువు స్థానమే నేడు ప్రశ్నార్ధకం అవుతోంది. కొంతమంది చాలా మంచి గురువులు ఉన్న ఎవరో చేసినదానికి మంచి వాళ్ళు కూడ భయపడుతున్నారు. నాడు తల్లితండ్రులు ఏదయినా ఊరు వేడితే పిల్లలను గురువు దగ్గర విడిచి వెళ్లేవారు. వారి తల్లితండ్రులు వచ్చాక వారిని క్షేమంగా అప్ప జెప్పేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. కొందరి గురువుల నిర్వాకమే అది. గురువు మంచి క్రమశిక్షణ, నీతి, నిజాయితీ తో వ్యవహరించాలి. పిల్లలకు మంచి విలువలు, నైతికత భోదించాలి. గురువు ఎక్కడైనా కనపడగానే నమస్కారం చేయాలి, ఆప్యాయంగా పలకరించాలి. గురువుల పని ఏదయినా చేసి పెట్టాలి. అదే పిల్లలు, గురువులకు ఇచ్చే పెద్ద గౌరవం. అందుకు గురువు చాలా సంతోషం తో "మా విద్యార్థి "అని గర్వంగ పది మందికి చెబుతాడు. ఇక అమ్మాయిల విషయం లో గురువు ఆచి, తూచి వ్యవహరించాలి. ఎక్కడ కూడా వారికి బాధ కలిగించే విధంగా ప్రవర్తించ కూడదు. వారి సాధక బాధకాలు తెలిసికొని వారు ఆర్థికంగా పైకి ఎదగడానికి సహాయ పడాలి.మనకు చేతనైనా సహాయం అందించాలి. అంతే కానీ వారిని నిరాశ పరచ కూడదు.వారు పైకి వస్తే మనకు ఎక్కడ లేని సంతోషం కలుగుతుంది. ఇది ఎన్ని కోట్లు పెట్టినా కలుగుతుంది? పిల్లల అభివృద్దే మనకు నిజమైన సంపద. మరో విషయం ఈ నాటి పిల్లలు అందరూ గ్రహించాలి. గురువు ఎక్కడైనా కనిపిస్తే దగ్గరకు వెళ్ళి పలకరించండి. కొంత మంది పిల్లలు, గురువు నడిచి వస్తుంటే బైక్ పై నుంచే మాట్లాడుతుంటారు. బైక్ దిగి మాట్లాడితే గౌరవంగా ఉంటుంది. ఇది అందరు విద్యార్థులు గ్రహించాలి. నాడు ఎ ఇంటిలోనైనా శుభ కార్యం జరిగితే ముందు గురువుకే ఆహ్వానం పోయేది. నేడు ఆ పరిస్థితి లేదు. అంతేందుకు విద్యార్థులు వివాహ నికి గురువులనే మరచి పొతున్నారు. గురువును తీసి పారేస్తున్నారు. కొంతమంది మంచి విద్యార్థులు గౌరవ భావంతో ఉంటారు. అది చాలు గురువుకి. ఏది ఏమైనా గురువు విద్యార్థులను పైకి తెచ్చే ఒక యంత్రం. అందుకే గురువు స్థానం పదిలం. గురువే అన్నిటికి మూలం.

**కనుమ ఎల్లారెడ్డి, 9391523027.**



# చిన్న వయసులోనే మోకాళ్ల నొప్పి.. కారణాలేంటి?



వయసు పెరిగేకొద్దీ మోకాళ్ల నొప్పులు రావడం సహజమేనని చాలామంది భావిస్తారు. కానీ ఇప్పుడు యువతలోనూ మోకాళ్ల సమస్యలు కనిపిస్తున్నాయి. 20, 30 ఏళ్ల వయసులోనే మెట్లు ఎక్కేటప్పుడు నొప్పి, ఎక్కువసేపు కూర్చొని లేచినప్పుడు ఇబ్బంది, మోకాలు బిగుసుకుపోవడం, వాపు, నడుస్తున్నప్పుడు అసౌకర్యం వంటి సమస్యలు కొందరిని వేధిస్తున్నాయి. అయితే చిన్న వయసులో మోకాలి నొప్పి వస్తే అది వృద్ధాప్యానికి సంకేతమని భావించడం సరైంది కాదు. గతంలో జరిగిన గాయం, అధిక శారీరక శ్రమ, వ్యాయామంలో తప్పులు, కండరాల బలహీనత, అధిక బరువు, పదేపదే ఒకే రకమైన కదలికలు వంటి అనేక కారణాలు దీనికి కారణం కావచ్చు.

**పాత గాయం.. కొత్త సమస్య**

చిన్న వయసులో మోకాలి నొప్పికి గతంలో జరిగిన గాయం కూడా కారణం కావచ్చు. క్రీడల్లో పాల్గొన్నప్పుడు మోకాలు మెలిక పడటం, పడిపోవడం, లిగమెంట్ లేదా మెనిస్కస్‌కు గాయం కావడం వంటి సమస్యలు అప్పట్లో తగ్గిపోయినట్టుగా అనిపించినా, తర్వాతి రోజుల్లో ఇబ్బందులు కలిగించే అవకాశం ఉంటుంది. గాయం పూర్తిగా కోలుకోకపోతే నడక తీరు మారవచ్చు. దీంతో మోకాలి మీద పడే ఒత్తిడి సరిగా పంపిణీ కాకపోవడం వల్ల నొప్పి మళ్లీ మొదలయ్యే అవకాశం ఉంది. గతంలో గాయం ఉన్నవారిలో తిరిగి మోకాలి సమస్యలు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుంది.

**వ్యాయామం మంచిదే.. కానీ పద్ధతిగా**

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి వ్యాయామం అవసరం. అయితే ఒక్కసారిగా వ్యాయామ తీవ్రతను పెంచడం, సరైన వార్మప్ లేకుండా పరుగులు తీయడం, అధిక బరువులతో వ్యాయామాలు చేయడం, నొప్పి వచ్చినా ఆపకుండా కొనసాగించడం మోకాళ్లపై అదనపు ఒత్తిడిని కలిగించవచ్చు. ముఖ్యంగా పరుగులు, జంపింగ్, స్క్వాట్స్, దిశను తరచూ మార్చాల్సిన క్రీడల్లో మోకాళ్లపై ఎక్కువ భారం పడుతుంది. అందుకే శరీర సామర్థ్యానికి అనుగుణంగా వ్యాయామాన్ని క్రమంగా పెంచుకోవడం అవసరం.

**కండరాల బలహీనత కూడా కారణమే**

మోకాలి కదలిక సక్రమంగా ఉండేందుకు చుట్టుపక్కల కండరాలు కీలక పాత్ర పోషిస్తాయి. తొడ, నడుము, కాలి కండరాలు బలహీనంగా ఉంటే మోకాలి కదలికపై అదనపు ఒత్తిడి పడవచ్చు. ఎక్కువసేపు కూర్చునే జీవనశైలి, శారీరక చురుకుదనం తగ్గిపోవడం, క్రమం తప్పిన వ్యాయామం వంటి కారణాలతో కండరాల బలం తగ్గవచ్చు. అందువల్ల మోకాళ్ల ఆరోగ్యానికి కేవలం నడక మాత్రమే కాకుండా, నిపుణుల సూచనతో కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు కూడా ఉపయోగపడతాయి.

**అధిక బరువు.. మోకాళ్లపై అదనపు భారం**

శరీర బరువు పెరిగినప్పుడు మోకాళ్లు మరింత భారాన్ని మోయాల్సి వస్తుంది. అధిక బరువు మోకాలి కీళ్లపై ఒత్తిడిని పెంచడంతో పాటు కాలక్రమంలో కీళ్ల సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. అందుకే బరువును ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచుకోవడం మోకాళ్ల సంరక్షణలో ముఖ్యమైన అంశం. అయితే బరువు తగ్గేందుకు ఒక్కసారిగా కఠినమైన వ్యాయామాలు చేయడం కాకుండా, ఆహారం, తగిన శారీరక చురుకుదనం, నిపుణుల సలహాతో క్రమంగా మార్పులు చేసుకోవడం మంచిది.

**నొప్పి వస్తే పూర్తిగా విశ్రాంతేనా?**

మోకాలి నొప్పి వచ్చిన ప్రతిసారీ పూర్తిగా కదలకుండా ఉండటం సరైన పరిష్కారం కాదు. సమస్యకు కారణాన్ని బట్టి చికిత్స మారుతుంది. తాత్కాలికంగా నొప్పి పెంచే కార్యకలాపాలను తగ్గించడం, తక్కువ ప్రభావం కలిగించే వ్యాయామాలను ఎంచుకోవడం, అవసరమైతే మంచు పట్టడం వంటి స్వీయ సంరక్షణ చర్యలు కొన్ని సందర్భాల్లో ఉపశమనం ఇవ్వవచ్చు. ఈత, సైక్లింగ్ వంటి తక్కువ ప్రభావం కలిగించే కార్యకలాపాలు కొన్ని మోకాలి సమస్యల్లో ఉపయోగపడవచ్చు. అయితే నిరంతరం నొప్పి కొనసాగితే స్వయంగా మందులు వాడకుండా వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది.

**నొప్పితో పాటు ఈ లక్షణాలు ఉంటే జాగ్రత్త**

మోకాలి నొప్పితో పాటు వాపు, బిగుసుకుపోవడం, ఎర్రగా లేదా వేడిగా మారడం, కాలు బలహీనంగా అనిపించడం, మోకాలు పట్టుతప్పుతున్న భావన, కదిలించేటప్పుడు శబ్దాలు రావడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. మోకాలిని పూర్తిగా వంచలేకపోవడం లేదా నిటారుగా చేయలేకపోవడం కూడా గమనించాల్సిన లక్షణమే. గాయం తర్వాత ఒక్కసారిగా తీవ్రమైన నొప్పి, భారీ వాపు లేదా కాలు మీద బరువు మోయలేని పరిస్థితి ఏర్పడితే వైద్యుడిని త్వరగా సంప్రదించాలి

**మోకాళ్లను కాపాడుకోవాలంటే..**

వ్యాయామం ప్రారంభించే ముందు తగిన వార్మప్ చేయాలి. వ్యాయామం ముగిసిన తర్వాత కూల్‌డౌన్‌కు సమయం కేటాయించాలి. సరైన షూస్ ధరించడం, వ్యాయామ తీవ్రతను ఒక్కసారిగా పెంచకుండా క్రమంగా పెంచడం, శరీరానికి తగిన విశ్రాంతి ఇవ్వడం అవసరం. క్రీడల్లో పాల్గొనేవారు సరైన టెక్నిక్, రక్షణ పరికరాలు ఉపయోగించాలి. నొప్పి ఉన్నప్పుడు దాన్ని పట్టించుకోకుండా వ్యాయామం కొనసాగించడం మాత్రం మంచిది కాదు.యువతలో మోకాలి నొప్పి వస్తే వయసును నిందించకుండా కారణాన్ని గుర్తించడం ముఖ్యం. చిన్న సమస్యగా భావించి నెలల తరబడి నిర్లక్ష్యం చేస్తే కొన్ని సందర్భాల్లో సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా తరచూ నొప్పి రావడం, వాపు ఉండటం, మోకాలు పట్టుతప్పడం, నడకలో ఇబ్బంది లేదా గాయం తర్వాత నొప్పి తగ్గకపోవడం వంటి పరిస్థితుల్లో ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. సరైన సమయంలో కారణాన్ని గుర్తించి తగిన చికిత్స, వ్యాయామం, జీవనశైలి మార్పులు పాటిస్తే మోకాళ్ల ఆరోగ్యాన్ని దీర్ఘకాలం కాపాడుకోవచ్చు.గమనిక: మోకాలి నొప్పికి అనేక కారణాలు ఉండవచ్చు. పై సమాచారం సాధారణ అవగాహన కోసం మాత్రమే; వ్యక్తిగత నిర్ధారణ లేదా చికిత్స కోసం వైద్య నిపుణుడిని సంప్రదించాలి.



## శివపల్లిలో ఆయిల్‌ఫామ్ సాగుకు శ్రీకారం!

- రెండు ఎకరాల్లో మొక్కల నాట్లు
- గ్రామంలో పారిశుద్ధ్యంపై అవగాహన

**పెద్దపల్లి మహా** : ఎలిగేడు: మండలంలోని శివపల్లి గ్రామంలో ఆయిల్‌ఫామ్ సాగుకు శ్రీకారం చుట్టారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ పెద్దపల్లి వారి సహకారంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, రైతులతో కలిసి రెండు ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌ఫామ్ మొక్కలను నాటారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణరావు సూచనల మేరకు రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించడంతోపాటు గ్రామంలో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయిల్‌ఫామ్ సాగు విధానం, మొక్కల సంరక్షణ, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సాగు ద్వారా కలిగే ప్రయోజనాలపై సంబంధిత శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

### చెత్త వేరు చేయడంపై అవగాహన

అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇళ్ల నుంచి వెలువడే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేరు చేసి సేకరణకు అందించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చెత్తను ఇష్టానుసారంగా పడేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ఉద్యానశాఖ ప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తూ రక్షణ చట్టాలను రూపొందించిందని
తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం భద్రాద్రి జిల్లా ఐ.డీ.ఓ.సీలో ల్యాండ్, సర్వీస్(ఆర్.ఓ.ఆర్), అట్రాసిటీస్ అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం ముగ్గురు కమీషన్ సభ్యులతో కలిసి నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతి పెద్ద ఏజెన్సీ జిల్లా భద్రాద్రి జిల్లా అని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వాటిని అందిపుచ్చుకొని ఆర్థికంగా దినదినాభివృద్ధి చెందాలని సూచించారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఎస్సీ ఎస్టీల భూమి సమస్యలు బ్యాక్ లాగ్ పోస్టులు వివరాలు ఉద్యోగులు రక్షణ కోసం చట్టాలను రోస్టర్ విధానాలు రూపొందించి వాటిని పకడ్బందీగా అమలు చేసేందుకు కమిషన్ చర్యలు చేపడుతుందని గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ ప్రజల పైన ఉద్యోగులపైన ఎటువంటి వేధింపులు కానీ చిత్రహింసలు గాని ఇబ్బందులు గురి చేసిన శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషన్ చైర్మన్ హెచ్చరించారు. న్యాయం కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ ఎస్టీ బాధితులకు ఎఫ్.ఐ.ఆర్ చార్జిషీట్ కమిషన్ కంపన్సేషన్ వరకు పారదర్శకంగా ఉండేందుకు అధికారులు పనిచేయాలని ఆదేశించారు. భద్రాద్రి జిల్లాకు శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఎన్ని సమస్యలు ఉన్న వాటి పరిష్కారం ఆ రాములోరి దయ వలన సత్వరమే తీరిపోతాయని కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు. దక్షిణ అయోధ్యగా పేరు గడించిన భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో భాగ్యమన్నారు. అదేవిధంగా వివిధశాఖల అధికారుల నుంచి వివరాలు తోపాటు ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల నివేదిక రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి జిల్లా పోలీస్ శాఖ నివేదికను కమిషన్ చైర్మన్ అడుగగా 2014 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 1115 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయాయని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. అందులో 51 కేసులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయని వాటిలో 20 కేసులో చార్జింగ్ చార్జిషీట్ చేశామని రెండు హైకోర్టు స్టేలు ఉండగా 9 కేసులు లీగల్ ఒపీనియన్ కోసం ఉన్నాయని 20 పెండింగ్ కేసులు ప్రస్తుతం ఉన్నట్లు ఎస్పీ వివరించారు.

భద్రాద్రి గిరి మార్ట్ ఆదర్శంనీయం..

భద్రాద్రి గిరి మార్ట్ ఏర్పాటు ఆదర్శంనీయమని కమిషన్ చైర్మన్ భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్‌ను అభినందించారు. గిరిజన మహిళా సంఘాల ఆధ్వర్యంలో వారి సాంప్రదాయ వృత్తి ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా భద్రాచలంలో ఈ గిరిమార్టును ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. వారి ఉత్పత్తులను ఏర్పాటు చేసి గిరిజనుల జీవనశైలి విధి విధానాలను కళ్ళకు కట్టే విధంగా చూపించిన మ్యూజియం అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. వారు ఉత్పత్తి చేసిన వస్తువులను మార్కెటింగ్ చేస్తు ప్రోత్సహిస్తు చర్యలు చెప్పట్టడం ఇలాంటి మార్పులను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.అనంతరం న్యాయంకోసం వచ్చిన ఎస్సీ ఎస్టీ బాధితుల నుంచి కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, నీలాదేవి, డీ.బీ.ఎఫ్ శంకర్ లతో కమిషన్ చైర్మన్ వెంకటయ్య
దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేసి ఎటువంటి నిర్లక్ష్యం అలసత్వం ప్రదర్శించకుండా తక్షణమే సమస్యలు పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వేణుగోపాల్, భద్రాచలం ఐటిడిఏ పి.ఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీ.ఆర్.ఓ పద్మావతి, సిపిఓ సునీత, జిల్లా షెడ్యూలు కులముల అధికారిని శ్రీలత, కార్పొరేషన్ ఈ.డీ ఉపేందర్, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ అనూష, డీ.ఏ.వో బాబురావు, విద్యుత్ శాఖ ఈ వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మోడల్ స్కూల్‌లో అల్పాహార కార్యక్రమం

**పెద్దపల్లి మహా :** ఓదెల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార కార్యక్రమాన్ని హరేరామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఓదెల మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణరావు హాజరై విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తూ వారితో ముచ్చటించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి పౌష్టికాహారం ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మోట్లపల్లిలో ఆధ్యాత్మిక శోభ.. ఘనంగా అన్నదానం

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: వినాయక నవరాత్రుల సందర్భంగా మోట్లపల్లి గ్రామంలో సోమవారం రోజున అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మల్లికార్జున యూత్ ఆధ్వర్యంలో లంబోదరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులు, గ్రామస్థులకు అన్నప్రసాదం వడ్డించారు. మరోవైపు శివాంజనేయ ఆలయంలో వినాయకుని కుంకుమ పూజను ఘనంగా నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రెండు కార్యక్రమాల్లోనూ గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## గణనాథుని దర్శనంలో సండ్ర.. పలు మండపాల్లో ప్రత్యేక పూజలు

**అంబేద్కర్ నగర్‌లో అన్నదాన కార్యక్రమం ప్రారంభం**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 21:** మహా వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా సత్తుపల్లి పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ రోడ్డు, బైపాస్ రోడ్డు, తుమ్మూరు రామారావు వీధి, జూపల్లి కంటి ఆసుపత్రి రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంబేద్కర్ నగర్‌లో ముత్యాలమ్మ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సండ్ర వెంకట వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సండ్ర వెంకట వీరయ్య ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి..

- ఐఎఫ్ఎంఎస్‌లో విలీనం చేయాలి..
- జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..
- ఎస్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా సిద్దెల తిరుమలరావు..



**మణుగూరు, మహా** : ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఐఎఫ్ఎంఎస్‌లో విలీనం చేసి నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని ఎస్‌పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పీఎస్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నబోస్క నరేష్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా సిద్దెల తిరుమలరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా సుమారు 18 వేల మంది కార్మికులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ సరైన గుర్తింపు, తగిన వేతనాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 జీవో ప్రకారం ఏజెన్సీ విధానంలో రూ.15,600 వేతనం ఉండగా, పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రూ.10 వేలు, రూ.10,500, రూ.11 వేల చొప్పున మాత్రమే చెల్లిస్తున్నారని ఆరోపించారు. కొన్ని ఏజెన్సీలు కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి కార్మికులందరినీ ఐఎఫ్ఎంఎస్ పరిధిలోకి తీసుకువచ్చి నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కార్మికులను ఏకతాటిపైకి తీసుకొచ్చి పెద్దఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు.

**జిల్లా కమిటీ ఎన్నిక**

ఎస్‌పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఈదునూరి అనిల్, గౌరవ సలహాదారుగా అశ్వరావుపేట వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా సిద్దెల తిరుమలరావు, ప్రధాన కార్యదర్శిగా దాట్ల శ్రావణ్‌కుమార్, కోశాధికారిగా దొంగరి హైమావతిలు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దేవకరణ గంగ, టేకుల రమేష్, జి.మమత, సహాయ కార్యదర్శులుగా బండారి లక్ష్మి, కె.పవన్, ఎం.డి.వెంకటరమణ, ప్రచార కార్యదర్శులుగా బాలు, అనిత, భాగ్యలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎస్ రాష్ట్ర కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్‌కుమార్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు చాగంటి నాగమణి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు బక్కుల మమత, ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల నాగేంద్ర, సహాయ కార్యదర్శి గద్దల కళ్యాణితో పాటు వివిధ ప్రభుత్వ ఆస్పత్రులకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## కాసిపేట 108 సిబ్బందికి రాష్ట్రస్థాయి 'లైఫ్ సేవర్' అవార్డు

**కాసిపేట / మందమర్రి మహా :** త్యవసర సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణాలు కాపాడిన కాసిపేట 108 అంబులెన్స్ సిబ్బంది ప్రతిభ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. విధి నిర్వహణలో వారు చూపిన సమయస్ఫూర్తికి గాను రాష్ట్రస్థాయి లైఫ్ సేవర్ అవార్డు లభించింది. కాసిపేట 108 అంబులెన్స్‌లో ఈఎంటీగా విధులు నిర్వర్తిస్తున్న ఆత్మరావు, పైలట్‌గా సేవలందిస్తున్న జాడ కొమరయ్య ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవడం, బాధితులకు తక్షణ ప్రాథమిక వైద్యం అందించి సకాలంలో ఆసుపత్రికి తరలించడంలో వీరు చూపిన చొరవ ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టింది.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, జనార్ధన్, ఈఎంఈ కొండల్‌రావుల చేతుల మీదుగా ఈ సిబ్బంది అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అత్యవసర వేళల్లో ప్రతి నిమిషం విలువైనదని, 108 సిబ్బంది వేగవంతమైన స్పందనే ప్రాణాలను కాపాడటంలో కీలకమంటూ వారిని అభినందించారు. రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం పట్ల ఈఎంటీ ఆత్మరావు, పైలట్ కొమరయ్య సంతోషం వ్యక్తం చేశారు.



## హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

**సత్తుపల్లి, సెప్టెంబర్ 21:** మహా : మానవ హక్కుల పరిరక్షణతో పాటు అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని స్పాట్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ ఫౌండర్, చైర్మన్ ధారావత్ వీరన్న పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పాట్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ ప్రారంభ సమావేశాన్ని ఆదివారం పాల్వంచలోని వరలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధారావత్ వీరన్న మాట్లాడుతూ.. సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘనలు, అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత సంస్థ ప్రతినిధులపై ఉందన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయడంతో పాటు ప్రజల్లో హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. సంస్థ సభ్యులు క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని అన్నారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ వైస్ చైర్మన్ కొనకళ్ల రామారావు, సౌత్ ఇండియా చైర్మన్ నందు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్వరావుపేట డివిజనల్ కార్యదర్శిగా కారుమూరి సతీష్ కుమార్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం సంస్థ కార్యకర్తలు, సభ్యులు మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.




## పెండింగ్ నిధులను విడుదల చేయాలి

- విద్యార్థి సంఘం నేత కోటా శివ శంకర్ డిమాండ్
- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకి వినతి పత్రం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ నిధులను 150 కోట్లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకి సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరుపేద ఎస్సీ ఎస్టీ విద్యార్థులు చదువుతున్న బిఎఎస్ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్ క్రింద సుమారుగా రెండు సంవత్సరాల నుంచి 150 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద ఎస్సీ ఎస్టీ విద్యార్థుల కోసం ప్రైవేట్ స్కూల్లో ఉచిత విద్యను అందించే బి ఏ ఎస్ స్కీం కింద గత రెండు సంవత్సరాల నుంచి ప్రభుత్వం 200 కోట్లకు గత మే నెలలో 50 కోట్లు మాత్రమే మంజూరు చేసిందని ఇంకా 150 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యని కోట శివశంకర్ విజ్ఞప్తి చేయడం జరిగింది. అదేవిధంగా షెడ్యూల్ క్యాష్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్లో కాలేజీ హాస్టల్ విద్యార్థుల కోసం నడుపుతున్న డిపార్ట్మెంట్ అటాచ్డ్ హాస్టల్స్ లలో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్లందర్నీ అవుట్సోర్సింగ్ ఉద్యోగస్తులుగా గుర్తించి ప్రభుత్వం ఫైనాన్స్ డిపార్ట్మెంట్ నుంచి అనుమతులు తీసుకోవాలని వారికి ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులుగా వారి పోస్టులన్నీ పర్మినెంట్ చేయాలని కోరారు. అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఈ విధానం సరైంది కాదన్నారు. నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళలు అనేకమంది ఈ ఉద్యోగాలను నమ్ముకుని నెలకి రూ.5000 నుంచి రూ.10000 లోపే అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని వీరందరినీ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులుగా ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోట శివశంకర్ విజ్ఞప్తి చేశారు.

## చెక్కు బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు..

**రూ.8 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం**

మణుగూరు, మహా : తీసుకున్న అప్పును తిరిగి చెల్లించేందుకు ఇచ్చిన చెక్కు బౌన్స్ అయిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.8 లక్షల పరిహారం చెల్లించాలని మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి సోమవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం.. చోడవరం ప్రాంతానికి చెందిన బాలాజీ వర్మ, మణుగూరు పట్టణానికి చెందిన శ్రీనివాస్ వద్ద రూ.8 లక్షలు అప్పుగా తీసుకున్నారు. రుణాన్ని తిరిగి చెల్లించే క్రమంలో 2017లో రూ.8 లక్షలకు చెక్కు జారీ చేశారు. శ్రీనివాస్ ఆ చెక్కును బ్యాంకులో సమర్పించగా, ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో చెక్కు బౌన్స్ అయింది. దీంతో శ్రీనివాస్ నిందితుడికి చట్టపరమైన నోటీసు పంపించారు. అయినప్పటికీ బాలాజీ వర్మ నుంచి స్పందన లేకపోవడంతో మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు. విచారణలో ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో పాటు ఫిర్యాదుదారుడికి రూ.8 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఫిర్యాదుదారు శ్రీనివాస్ తరఫున న్యాయవాదులు బొమ్మా రామకోటయ్య, అన్వేష్ యలమంచిలి వాదనలు వినిపించారు.



## వ్యాపారాభివృద్ధితోనే స్థానిక ఆర్థిక ప్రగతి

- చాయ్ దునియా "టీ" షాపును ప్రారంభించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్

**సత్తుపల్లి, సెప్టెంబర్ 21**:మహా : సత్తుపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన చాయ్ దునియా టీ షాపును రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

చిన్న వ్యాపారాలు బలోపేతం కావాలి

ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. స్థానికంగా కొత్త వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తూ వ్యాపార రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. నాణ్యత, మంచి సేవలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని చాయ్ దునియా నిర్వాహకులకు సూచించారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతూ మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, వార్డు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ ఏ.ఎస్. రావు జయంతి సందర్భంగా మెగా ఆరోగ్య, రక్తదాన శిబిరం

**హాజరైన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** డాక్టర్ ఏ.ఎస్. రావు జయంతిని పురస్కరించుకుని రెటినోవా నోవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహించిన మెగా ఆరోగ్య, రక్తదాన శిబిరానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుషాయిగూడలోని సాయి సుధీర్ డిగ్రీ & పీజీ కళాశాల, ఈసీఐఎల్ లో సోమవారం నిర్వహించిన ఈ శిబిరంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఆరోగ్యకరమైన సమాజమే అభివృద్ధికి బలమైన పునాది" అని అన్నారు. ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు అందించడంతో పాటు రక్తదానంపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, యువత స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. శిబిరంలో కంటి పరీక్షలు, దంత పరీక్షలు, బీపీ, షుగర్, ఈ సి జి, గైనిక్ చెకప్, హోమియోపతి, ఫిజియోథెరపీ తదితర ఉచిత వైద్య సేవలు అందించారు. అదేవిధంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెటినోవా నోవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డి. సునీల్ కుమార్ ట్రాఫిక్ సిఐ మల్లేష్, డిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై సాయిలు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మహేష్ గౌడ్, ఉషా రాణి తదితరులు పాల్గొన్నారు. "సేవ - సహకారం - బలమైన సమాజం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం లభించింది.



# పర్యావరణ పరిరక్షణకు అందరూ నడుం బిగించాలి

- **అక్షర యూత్ సభ్యుల మట్టి వినాయక విగ్రహాల కృషి అభినందనీయం**
- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మందమర్రి, మహా :** వినాయక చవితి వేడుకల్లో పర్యావరణ పరిరక్షణను కాపాడేలా అక్షర యూత్ సభ్యులు చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రశంసించారు. సోమవారం మందమర్రి మున్సిపాలిటీ రైల్వే స్టేషన్ రోడ్డు (శ్రీపతి నగర్)లో అక్షర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి గణపతి విగ్రహాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడేళ్లుగా నిరంతరంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడమే కాకుండా, ప్రతి ఏటా దశావతారాల్లో ఒక్కో అవతారాన్ని ప్రతిబింబించే విగ్రహాలను రూపొందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ అక్షర యూత్‌ను ఆదర్శంగా తీసుకుని మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షించడంలో తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయన విగ్రహాలకు దూరంగా ఉంటూ, పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ప్రోత్సహించడంలో యువత భాగస్వామ్యం పెరగాలని ఆయన కోరారు. ఈ ఏడాది ప్రత్యేకంగా రూపొందించిన ఆదిశేషుని పడగలపై మహావిష్ణువు అవతారంలోని గణపతి విగ్రహం చిత్రంతో కూడిన జ్ఞాపికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అక్షర యూత్ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, అక్షర యూత్ సభ్యులు చింతకింది రామకృష్ణ, శివ, సాయి, శ్రావణ్, రాజిరెడ్డి, కళ్యాణ్, రాకేష్, పురోహితులు గోవర్ధనగిరి అనంత చారి, కృష్ణ కాంత్ చారి, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి: మోటే శ్రీశైలం

**యాచారం సెప్టెంబర్ 21 మహా:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మోటే శ్రీశైలం అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు, యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం ఆధ్వర్యంలో, కుర్మిద్దలో గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా గోపలీ జోసెఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ యుత్ అధ్యక్షులుగా పోలోజు సాయి చరణ్, ఉపాధ్యక్షులుగా జక్కుల రాజుని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా నీలం చక్రపాణి, కార్యదర్శి సూరిగి రమేష్ గౌడ్, కోశాధికారి పలమోని రాజు, ప్రచార కార్యదర్శి నీలం శ్రీను, కార్యవర్గ సభ్యులు గొట్టే శేఖర్, బాలయ్య, గోవర్ధన్, శంకర్, ఎన్ రవీందర్ సలహాదారులు గొట్టే యాదయ్య, ఎడ్ల సత్యనారి, నీలం జంగయ్య, యాదయ్య లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాటే శ్రీశైలం మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వచ్చే ఎన్నికలలో మెజార్టీ స్థానంలో పార్టీని గెలిపించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేలా ప్రతి ఒక్క కార్యకర్త పాటుపడాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి. రాజశేఖర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాశం జయ ప్రకాష్, వార్డు సభ్యులు గోపాలి కల్పన మహేందర్, సముద్రాల ప్రవీణ్, నీలం లక్ష్మి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



## జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు బెల్లంపల్లి డిగ్రీ విద్యార్థిని ఎంపిక

- **హర్షం వ్యక్తం చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ బి జెడ్ సి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సనా అంజుమ్ జాతీయస్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ వెల్లడించారు. విద్యార్థిని వివిధ స్థాయిలలో సాఫ్ట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి కాకతీయ విశ్వవిద్యాలయం తరపున అర్హత సాధించారని పేర్కొన్నారు. త్వరలో జాతీయస్థాయిలో జరగనున్న సాఫ్ట్బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సాధించిన ఘనతపై ప్రిన్సిపాల్ తోపాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



## పండుగలు సామరస్యానికి ప్రతీకలు

- **కృతతోనే సమాజ పురోగతి సాధ్యం**
- **ఆధ్యాత్మిక భావన సన్మార్గం చూపుతుంది**
- **యువతలో సామాజిక చైతన్యం అభినందనీయం**
- **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పండుగలు సమాజంలో సామరస్యానికి సోదరభావానికి ప్రతీకలుగా నిలుస్తాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం రామాటాకీస్ ఏరియా పాత కొత్తగూడెం బూడిదగడ్డ తదితర ప్రాంతాలలో వివిధ ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తో కలిసి ఆయన సందర్శించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కులమతాల అంతరాలు లేకుండా అందరూ కలిసి జరుపుకునే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు పరోపకార గుణాన్ని పేదలకు సాయపడే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యావంతులై సామాజిక చైతన్యానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గంలోని ప్రతీ సమస్య పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మండపాల నిర్వాహకులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో బాధ్యతాయుతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, మునిగడప వెంకటేశ్వర్లు, బండి నర్సింహా, విసంశెట్టి విశ్వేశ్వరరావు, సునీత, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, సాంబిరెడ్డి, మల్లేష్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



## వెంకట సాయి నగర్ కాలనీలో నూతన డ్రైనేజీ లైన్ ప్రారంభం

- **కాలనీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ నియోజకవర్గంలోని వెంకట సాయి నగర్ కాలనీలో రూ.13.75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన డ్రైనేజీ లైన్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం ప్రారంభించారు. నూతన డ్రైనేజీ లైన్ అందుబాటులోకి రావడంతో కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ మరింత మెరుగుపడటంతో పాటు, మిగిలిన ప్రాంతాలను కూడా ప్రధాన డ్రైనేజీ వ్యవస్థతో అనుసంధానం చేసేందుకు అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వెంకట సాయి నగర్ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా డ్రైనేజీ, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. కాలనీలో డ్రైనేజీ పనులు పూర్తవుతున్న నేపథ్యంలో సీసీ రోడ్ల పనులను కూడా త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. డ్రైనేజీ, రహదారుల పనులు పూర్తయితే కాలనీలో మౌలిక వసతులు మరింత మెరుగుపడి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా వెంకట సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎ. విజయేందర్ రెడ్డి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. రూ.13.75 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ లైన్ అందుబాటులోకి రావడం ద్వారా కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కీలక ముందడుగు పడిందని తెలిపారు. మిగిలిన సీసీ రోడ్ల పనులు కూడా పూర్తయితే కాలనీ మౌలిక వసతులు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంధం నాగేశ్వరరావు, పసుల ప్రభాకర్, ఎం.డి. జాంగీర్, చారి దినేష్ శ్రీను కాలనీ అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, గౌరవ సభ్యులు రమేష్ గౌడ్, ఎం. రవికుమార్, గోపాల్ యాదవ్, సర్వ సత్తయ్య యాదవ్, శివ శంకర్, సంజీవ, బాలయ్య, కమిటీ సభ్యులు జి. అశోక్, శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ విద్యాసాగర్, రామకృష్ణ, శివకుమార్, బి. చలపతిరావు, నరేష్, గణేష్, నరసింహారెడ్డి, పి. మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హరీష్, శేఖర్, చారి, సిద్ధు గౌడ్, బాల కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాది ఇందిరా ప్రియదర్శిని సేవలు అభినందనీయం

- **ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**
- **ఇందిరా ప్రియదర్శిని దంపతులకు ఘనంగా సన్మానం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** న్యాయవాదిగా ఇందిరా ప్రియదర్శిని అందిస్తున్న సేవలు అభినందనీయమని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ఇటీవల వరంగల్ లోని కాళోజి ఆడిటోరియంలో సుప్రసిద్ధ ప్రజాకవి సంఘసంస్కర్త స్వాతంత్ర సమరయోధుడు దివంగత కాళోజి జయంతి సందర్భంగా ఉత్తమ ప్రతిభతో విశిష్ట న్యాయవాద సేవలను అందిస్తున్నందుకుగాను ఫ్యూన్ బస్తీకి చెందిన ప్రముఖ అంబేద్కర్ వాది సామాజిక వాది ఉల్లోజు వెంకటరమణ సతీమణి ప్రముఖ న్యాయవాది ఇందిరా ప్రియదర్శిని హైకోర్టు జడ్జి చేతుల మీదుగా బెస్ట్ జూనియర్ అడ్వకేట్ తో పాటు ప్రతిష్ఠాత్మక కాళోజీ నంది అవార్డును కూడా స్వీకరించడం పట్ల హర్షం ప్రకటిస్తూ సోమవారం చుంచుపల్లిలోని సంఘ కార్యాలయంలో భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం టీఈఏఎం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని దంపతులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించి మెమొంటోను బహుకరించారు. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మాట్లాడుతూ ఒక సామాన్య దళిత కుటుంబంలో జన్మించి అంకితభావం కృషిదీక్ష దక్షతలతో న్యాయవాద వృత్తిని చేపట్టి ముఖ్యంగా పేద ప్రజలకు బడుగు బలహీన వర్గాలకు విశిష్టమైన న్యాయపరమైన సేవలు అందిస్తూ న్యాయవాద వృత్తిలో అత్యంత ప్రతిభ కనబరుస్తూ భారతరత్న అంబేద్కర్ ఆశయ సాధన కోసం మహిళా సాధికారత కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఇందిరా ప్రియదర్శిని సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన కాళోజి నంది అవార్డును స్వీకరించడం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకే గర్వకారణమని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు. ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, సన్మాన గ్రహీత ఇందిరా ప్రియదర్శిని, ఉల్లోజు వెంకటరమణలతో పాటు టీఈఏయం కమిటీ రాష్ట్ర కన్వీనర్, ప్రముఖ అంబేద్కర్ దాసరి రమేష్, రాష్ట్ర గౌరవ సలహాదారులు రిటైర్డ్ సింగరేణి జిఎం శనగ వెంకటేశ్వర్లు, బరగడి దేవదానం, కో కన్వీనర్లు శెట్టి కమలాకర్, బూర్గుల కరుణాకర్, కోర్ కమిటీ సభ్యులు గడ్డం వెంకటేశ్వర్లు, తలారి కిషోర్ బాబు, అంబేద్కర్ సంఘం నాయకులు దేవదాసు, రాజేశ్వరరావు, శివలు పాల్గొన్నారు.



## గణనాథుని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

- **హైకోర్టు కాలనీలోని వినాయకులకు ప్రత్యేక పూజలు**
- **ప్రజలు సంతోషంగా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన కళ్లెం..**

**హయత్ నగర్ సెప్టెంబర్ 21 మహా:** హైకోర్టు కాలనీ వినాయక మండపాని సందర్శించిన, మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గణనాథుని దర్శించుకున్నాడు. హయత్ నగర్, హైకోర్టు కాలనీ డివిజన్లో, గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శారదా నగర్ శివపార్వతి యూత్ అసోసియేషన్, అరుణోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహిస్తున్న నిర్వాహకులు, యువజన సంఘాల సభ్యులు కాలనీ సంఘాల సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బీజేపీ హయత్ నగర్ హై కోర్ట్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, మధు సుధన్ రెడ్డి, సీనియర్ నాయకులు గోవింద చారి, లక్ష్మణ్, బీజేవైఎం నాయకులు హృతిక్, మహిళలు తదితరులు పాల్గొన్నారు..

# భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం..

- **నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు..**
- **సింగరేణి, మణుగూరు ఏరియా ప్రగతికి ప్రార్థనలు**



**మణుగూరు, మహా :** శ్రీశ్రీశ్రీ స్వామి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మణుగూరు ఏరియాలోని బంగ్లౌస్ ప్రాంతంలో సోమవారం లక్ష్మీ గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించగా అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, ఆయన సతీమణి సుమతిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, మణుగూరు ఏరియా ప్రగతితో పాటు ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ సందర్భంగా జీఎం దుర్గం రామచందర్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. స్వామివారి ఆశీస్సులతో సింగరేణి సంస్థ మరింత అభివృద్ధి చెందాలని, మణుగూరు ఏరియా అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి హాజరయ్యారు. కుటుంబ సమేతంగా హాజరైన ఉద్యోగులు, అధికారులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నవరాత్రి ఉత్సవాలతో బంగ్లౌస్ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం డివి రామారావు, పీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాసచారి, ఎస్ఎంఎస్ ప్లాంట్ ఇన్‌చార్జి ఆర్.భాస్కరరావు, క్వాలిటీ డిపార్ట్‌మెంట్ మేనేజర్ నాగ రమేష్, పీకేఓసీ అడిషనల్ మేనేజర్ నాగేందర్, ఫైనాన్స్ మేనేజర్ రమేష్, జేఈ కృష్ణారావు, ఈఈ నరసింహారావుతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గురజాడ అప్పారావు 164వ జయంతి సందర్భంగా సంస్మరణ సభ

- **స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కార్యక్రమం**
- **గురజాడ సాహిత్య, సామాజిక సంస్కరణ సేవలను స్మరించిన వక్తలు**



**కుషాయిగూడ, మహా :** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, అభ్యుదయవాది గురజాడ అప్పారావు 164వ జయంతి సందర్భంగా సోమవారం కమలానగర్ కార్యాలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యుడు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారుడు బొమ్మగాని రుక్కయ్య, సామాజిక ఉద్యమ నాయకుడు జయరాజు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రుక్కయ్య గురజాడ రచించిన దేశభక్తి గీతాన్ని ఆలపించారు. గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యంలో వ్యవహారిక భాషను బలంగా వినియోగించి కవితా, సాహిత్య ప్రక్రియలకు కొత్త దిశ చూపారని తెలిపారు. ఆయన రచనలు సమాజంలోని పలు దురాచారాలను ప్రశ్నించాయని, ముఖ్యంగా 'కన్యాశుల్కం', 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' వంటి రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని కలిగించారని పేర్కొన్నారు. జయరాజు మాట్లాడుతూ అప్పటి సమాజంలో కన్యాశుల్కం పేరుతో మహిళలు ఎదుర్కొన్న అన్యాయాలకు వ్యతిరేకంగా గురజాడ తన రచనల ద్వారా పోరాటం సాగించారని తెలిపారు. సామాజిక సంస్కరణ ఉద్యమాలకు ఆయన రచనలు బలాన్ని అందించాయని పేర్కొన్నారు. 'కన్యాశుల్కం' నాటకం ఇప్పటికీ ప్రదర్శితమవుతూ ప్రజలను ఆలోచింపజేస్తోందన్నారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, ఎం. భాస్కర్ రావు, వెంకటాచలం, రుక్కయ్య తదితరులు ప్రసంగించారు. అనంతరం గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. ఎం. శ్రీనివాసరావు, జి. శ్రీనివాసులు, గౌసియా, సుధాకర్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- **అధికారులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు**

**ఆదిలాబాద్ మహా**: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను విన్నారు.ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి, పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజావాణిలో ప్రధానంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ఆసరా పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, రాజేశ్వర్, డీఆర్ఓ స్రవంతి, ఏవో వర్ణ, డీఆర్‌డీఏ అధికారి రవీందర్ వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# నారాయణపూర్‌కు న్యాయం చేస్తాం

- **సంయమనం పాటించండి.. ఆందోళన చెందొద్దు**
- **చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా**
- **సమగ్ర నివేదికతో ప్రభుత్వానికి నివేదిస్తాం: కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్, మహా**: నారాయణపూర్ రిజర్వాయర్ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నారాయణపూర్ గ్రామస్తులకు ప్రభుత్వం న్యాయం చేసేలా కృషి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. గ్రామస్తులు సంయమనం పాటించాలని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రభుత్వానికి లేఖ రాయాలని కోరారు. ముంపు గ్రామంగా ప్రకటించడం సాధ్యం కాకపోతే, గ్రామస్తులకు అనువైన ప్రాంతంలో ఇంటి స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా నారాయణపూర్ గ్రామస్తులతో సమావేశమయ్యారు. రిజర్వాయర్ కారణంగా ఎదురవుతున్న సమస్యలు, భూసేకరణ, ముంపు ప్రభావం, పరిహారం తదితర అంశాలను గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి అభ్యర్థనలు, సమస్యలను కలెక్టర్ ఓపికగా విని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణపూర్ రిజర్వాయర్ ద్వారా చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని చెప్పారు. నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలనే అంశాన్ని పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించినట్లు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గ్రామానికి తీసుకువచ్చి సమస్యలను వివరించామని, తాజాగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు ఎలాంటి ఆందోళనలకు వెళ్లకుండా ప్రభుత్వంతో కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. తాను గ్రామస్తులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. రెవెన్యూ, భూసర్వే, నీటిపారుదల శాఖల నుంచి నివేదికలు సేకరించి, కమిటీ ద్వారా గ్రామ సమస్యలను పరిశీలిస్తామని చెప్పారు. ఎంత మేర ముంపు ప్రభావం ఉంటుందో శాస్త్రీయంగా అంచనా వేసి, పాక్షికంగా నష్టపోయే వారికి కూడా తగిన పరిహారం కల్పించేలా ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. భూసేకరణకు గ్రామస్తులు సహకరించాలని, అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా అందజేయాలని సూచించారు.



# కలెక్టర్ కు దివ్యాంగుల సత్కారం

**చిత్రపటానికి పాలాభిషేకం**

**ఆదిలాబాద్ మహా:** దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఇమ్రాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో సొసైటీ నాయకులతో కలిసి కలెక్టర్ ను శాలువాలతో సత్కరించి ఆవరణలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. వికలాంగులకు కోటా కంటే అధికంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించడంతో పాటు ప్లంబింగ్, నీటి సరఫరా, వీధి దీపాల సమస్యలను సత్వరం పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



# ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

**ఆదిలాబాద్ మహా**: పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లా నలుమూలల నుండి 26 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి తెలియజేశారు. సమస్యలను విన్న జిల్లా ఎస్పీ నేరుగా పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి పరిష్కరించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులను పరిష్కరించినప్పుడు బాధితులలో పోలీసుల పట్ల గౌరవం నమ్మకం పెరుగుతుందని తెలిపారు. భూ ఆక్రమణలు, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల సమస్యలు, వివిధ కేసుల పట్ల ఉన్న సమస్యలుపై బాధితులు ఫిర్యాదులు సమర్పించారు.. ప్రతి ఒక్కరి సమస్యను క్షుణ్ణంగా విశ్లేషించి న్యాయం చేకూరుస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, గుడుంబా, మదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్న 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా సమాచారం అందించవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా** : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలిచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి నాగయ్య తన కుమారుడు తన భూమిలోకి రాకుండా అడ్డు కుంటున్నాడని ఈ విషయలో తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 5వ వార్డుకు చెందిన గుర్రం అంకమ్మ తాను చుట్టూ రేకులతో తాత్కాలిక ఇల్లు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కల్లు సునీత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, బిల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం గన్ పూర్ గ్రామానికి చెందిన కొట్టే అశోక్ తన తండ్రి పేరిట గల భూమి నిషేధిత జాబితాలో ఉందని, ఇట్టి భూమిని రికార్డుల ప్రకారం సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జన్నారం మండలం కవ్వాల్ గ్రామ సర్పంచ్ తమ గ్రామపంచాయతీలో స్థానికంగా లేని కొంతమంది వ్యక్తులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంపై తగు విచారణ జరిపి ఓటరు జాబితా ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన జి శైలజ తాను కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఫిజిక్స్ గెస్ట్ టీచర్ గా విధులు నిర్వహించానని, తనకు రావలసిన వేతనం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల చొరవ చూపాలని అన్నారు.

# గీసుగొండ లో దారుణం.. డబ్బు కోసం తమ్ముడినే చంపిన అన్న

- **24 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**
- **నేరానికి ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసులు**
- **వివరాలు వెల్లడించిన మామునూరు ఏసిపి వెంకటేష్**




**వరంగల్,గీసుగొండ మహా** : వరంగల్ జిల్లా లోని గీసుగొండ లో దారుణం చోటుచేసుకుంది. తల్లి డబ్బు కోసం తోడబుట్టిన తమ్ముడినే హత్య చేసిన అన్న. గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని గరీబ్‌నగర్ లో జరిగిన హత్య కేసును గీసుగొండ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి, మృతుడి అన్నను అరెస్ట్ చేశారు. ఏసిపి తెలిపిన వివరాల ప్రకారం

ఈనెల 19వ తేదీన రాత్రి సుమారు 9.30 గంటలకు గరీబ్‌నగర్‌లోని ఒక అద్దె ఇంటిలో ఎలుబాక ప్రసాద్ (31) కత్తిపోట్ల కు గురై మృతి చెందాడు. మృతుడి ఛాతి,వీపు భుజం ప్రాంతాల్లో తీవ్ర కత్తిపోటు గాయాలు ఉన్నాయి. మృతుడి తల్లి ఎలుబాక సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీస్ స్టేషన్ లో హత్య నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, ఈస్ట్ జోన్ క్లూస్ టీమ్ శాస్త్రీయ ఆధారాలు కూడా సేకరించిందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు ఎలుబాక ప్రవీణ్ (33)తన తల్లి వద్ద తరచుగా డబ్బులు అడిగేవాడు ఈ విషయమై ప్రసాద్ నిందితుడిని దూషించడంతో ఇద్దరి మధ్య గతంలో పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో మృతుడి పై నిందితుడు కక్ష కట్టి తన తల్లి సంపాదించే డబ్బు తనకే దక్కాలనే దురుద్దేశంతో సొంత తమ్ముడినే హత్య చేశాడు.19వ తేదీన రాత్రి నిందితుడు తను స్వతహాగా వెల్డర్ అయినందున తను తయారు చేసుకున్న కత్తిని వెంట తీసుకుని గరీబ్‌నగర్ లోని తన తమ్ముడు,తల్లి ఉండే ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆసుపత్రిలో నైట్ డ్యూటీలు నిర్వహించే తల్లి నైట్ డ్యూటీకి వెళ్లి పోగా , ప్రసాద్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. నిందితుడు కావాలనే తన తమ్ముడితో వాగ్వాదానికి దిగి గొడవ పెట్టుకుని తాను ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కత్తితో తన తమ్ముడు ప్రసాద్ వీపు, ఛాతి,భుజం పై పలుమార్లు పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో మృతుడు అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. ఈ సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోను చేయగా అంబులెన్స్ సిబ్బంది అక్కడికి వచ్చి పరిశీలించి అతను మరణించినట్లు నిర్ధారించారు. నిందితుడు తన తమ్ముడు పై దాడికి దిగే సమయంలో పెనుగులాటలో నిందితుడి ఎడమ బొటనవేలుకు కూడా గాయమై రక్తస్రావమైందని ఏసిపి తెలిపారు. 20 9 2026 తెల్లవారుజామున తన బొటనవేలికి అయిన గాయానికి ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స తీసుకున్నాడు. దాడి అనంతరం నిందితుడు తన తల్లిని కూడా బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. 21 9 2026 తేదీన ప్రవీణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పొదల్లో దాచిన హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఈస్ట్‌జోన్ క్లూస్ టీమ్ శాస్త్రీయ ఆధారాలు కూడా సేకరించింది. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు



# బాలికల సంక్షేమమే మోదీ ప్రభుత్వ లక్ష్యం

- **బిజెపి ఎస్సీ మోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయలు**

**బెల్లంపల్లి,మహా** :దేశంలోని బాలికల సంక్షేమం కోసం పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వ లక్ష్యం అని బిజెపి ఎస్సీ మోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు.ఈ సందర్భంగా బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నేటి బాలలే రేపటి దేశ పౌరులని విద్యార్థులంతా క్రమశిక్షణతో చదివి ఉన్నతమైన స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం బాలికల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతుందని తెలిపారు. 25 ఏళ్ల ప్రజా జీవితంలో ఈ దేశానికి మోదీ విశేష సేవలందించారని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం ఈ దేశంలోని మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కవిత,బిజెపి మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్,జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్, సీనియర్ నాయకులు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి,జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్ మండల కార్యదర్శి గాదె రాజేశం, మండల నాయకులు ఆవుల చందు,కామేర మహేష్, ఉపాధ్యాయురాలు సుమన చైతన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**పెద్దపల్లి మహా** : గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ-గుండమ్మ చెరువు కట్ట వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీస్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. భక్తుల రాకపోకలకు




ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో ఓటరు సర్వే కష్టాలు

- **బిఎల్‌ఓలు, ప్రజల ఉక్కిరిబిక్కిరి..!**




**మందమర్రి /మంచిర్యాల, మహా** : ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల నిబంధనల మేరకు చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన (సర్వే) ప్రక్రియ మందమర్రి పట్టణంలో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. అధికారులు విధించిన నిబంధనలు, రకరకాల ధృవీకరణ పత్రాల డిమాండ్లతో ఒకవైపు ఓటర్లు మీసేవ కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతుంటే.. మరోవైపు క్షేత్రస్థాయిలో విధులను నిర్వర్తిస్తున్న బూత్ లెవెల్ ఆఫీసర్లు (డి.ఎల్.వో), అంగన్వాడీ ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

**అసలేం జరుగుతోంది..? - సమస్యల ఇతివృత్తం**

ప్రతి ఓటరుతో 'సర్' ఫారాలను నింపించి నెల రోజుల్లోగా ఇవ్వాలని విధించిన గడువు ముగిసినా, ఆ తర్వాత మళ్లీ ఆ ఫారాలలో తప్పులున్నాయంటూ ఏకంగా బిఎల్‌ఓలకే నోటీసులు రావడం కలకలం రేపుతోంది. వాటిని సరిదిద్దే మార్గం తెలియక అధికారులు సతమతమవుతున్నారు.

**2002 ఓటరు లిస్టు కొర్రీ**

ప్రస్తుత జాబితాకు 2002 నాటి ఎన్నికల జాబితాతో పోలిక నిబంధన పెట్టడంతో, దశాబ్దాల క్రితం నాటి పత్రాలు దొరకక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరక్షరాస్యుల అవస్థలు ఫారాలు ఎలా నింపాలో తెలియక వయోవృద్ధులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కొందరికి విద్య అర్హత, నివాస ధృవీకరణ పత్రాలు కావాలని అడుగుతుండటంతో మీసేవ కేంద్రాల వద్ద రద్దీ విపరీతంగా పెరిగింది.

**నిబంధనల చిక్కులు**

కుల ధృవీకరణ పత్రం కోసం పలువురు విద్యార్హత కలిగిన వారు బదిలీ ధృవపత్రాన్ని సమర్పించి కుల ధృవీకరణ పత్రం పొందుతుండగా, నిరక్షరాస్యులకు ఇది పెను సవాలుగా మారింది. ఈ పత్రం కొరకు కుల సంఘం నేతల నుండి లేఖ, న్యాయవాది నుండి నోటరీ అఫిడవిట్, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు లేఖ వంటి కఠిన షరతులు విధించారు. ఈ మూడు లేఖల అనంతరం మీసేవ ద్వారా కుల ధృవీకరణ పత్రం పొందడం కొరకు పేద, సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగలేక విసిగిపోతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారుల నుండి సరైన అవగాహన కల్పించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అంగన్వాడీల అష్టకష్టాలు**

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో ఈ సర్వే బాధ్యతలను అత్యధికంగా అంగన్వాడీ టీచర్లకు అప్పగించారు. ఒకవైపు తమ ప్రధాన విధులను నిర్వర్తిస్తూ మరోవైపు ఈ అదనపు భారాన్ని మోయడం వారికి శాపంగా మారింది. నిత్యం అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, సమావేశాలు, సభలు, బాలింతలకు గుడ్ల పంపిణీ, మధ్యాహ్న భోజన తయారీ, చిన్నారులకు సత్తుపిండి పంపిణీ వంటి పనులతో ఉరుకులు పరుకులు పెట్టే అంగన్వాడీలకు.. బిఎల్‌ఓ విధులు పెనుభారంగా మారాయి.

## శాశ్వత పరిష్కారం శూన్యం

ఉన్నతాధికారుల నుంచి రోజువారీ టార్గెట్ల ఒత్తిడి పెరగడంతో, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను, ఉద్యోగులను ఒకేసారి ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ నిబంధనలపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమన్వయ లోపం వల్లనే ఈ సమస్య తలెత్తిందని, తక్షణమే రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరుతున్నారు. అంగన్వాడీలపై ఉన్న అదనపు భారాన్ని తగ్గించి, ఈ సర్వే ప్రక్రియను సులభతరం చేయాలని, అనవసరమైన కొర్రీలు, పత్రాల వేధింపులకు తెరదించాలని మందమర్రి ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# శాంతినగర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు

**మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్**

**వరంగల్, మహా ;** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ నగరం 22వ డివిజన్ శాంతినగర్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ కాలనీ వాసులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులపై సీపీ ఆరా

**పెద్దపల్లి మహా :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఫిర్యాదుదారులను ఒక్కొక్కరినీ స్వయంగా ప్రశ్నిస్తూ వారి సమస్యలు ఏమిటి? సమస్యకు సంబంధించిన వివరాలు ఏమిటి? ఇప్పటివరకు ఎవరిని సంప్రదించారు? అనే విషయాలను సీపీ అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరంగా, పారదర్శకంగా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావడానికి ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. పోలీస్ శాఖ ప్రజల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఫిర్యాదులను నేరుగా స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**పెద్దపల్లి మహా** : వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సీపీ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.సమావేశంలో పోలీస్, సింగరేణి, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ఫిషరీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. వినాయక నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై సీపీ సమీక్షించారు. గతేడాది నిమజ్జనం సందర్భంగా ఎదురైన సమస్యలు, ఇబ్బందులు, లోపాలను గుర్తించి ఈసారి అవి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాలు, శోభాయాత్ర మార్గాలు, రద్దీ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో నీటి లోతు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఫిషరీస్, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శిక్షణ పొందిన ఈతగాళ్లు, రెస్క్యూ బృందాలు, రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని చించారు.నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, లైటింగ్, రోడ్లు, పార్కింగ్ వంటి సదుపాయాలను మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. నిమజ్జన మార్గాలు, మండపాలు, ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను ముందుగానే పరిశీలించి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఫైర్ టెండర్లు, సిబ్బంది, రక్షణ పరికరాలను కీలక ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. శోభాయాత్ర మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, రద్దీ నిర్వహణ, పార్కింగ్, క్రేన్‌లు, అత్యవసర సేవల సమన్వయంపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ ఆదేశించారు.నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీపీ అంబర్ కిశోర్ ఝా సూచించారు.ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, ఆర్జీ1 జీఎం లలిత్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, జైపూర్ సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ భూమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎంజీఎంను సందర్శించిన ఉన్నతాధికారులు

**వరంగల్, ఎంజీఎం, మహా:** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ పెచ్చులు ఊడిపడి రోగులు గాయపడిన ఘటనపై వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానా జె. చొంగ్తు, వైద్య విద్యాశాఖ సంచాలకురాలు డాక్టర్ వాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య సోమవారం ఆస్పత్రిని సందర్శించారు. తొలుత ఆరోగ్యశ్రీ వార్డును పరిశీలించి ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, చికిత్స వివరాలను పరిశీలించారు. ఆస్పత్రి భవనాల స్థితిగతులపై ఆర్అండ్‌బీ ఈఈ నరేందర్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ ఈఈ ప్రసాద్‌లతో వివరాలు తెలుసుకున్నారు. భవనాల భద్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాలను పరిశీలించి వైద్యులు, సిబ్బంది అందుబాటు, హాజరు వివరాలను తనిఖీ చేశారు. సమయపాలనతో విధులకు హాజరై రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

**బీజేపీ నిరసన**

స్లాబ్ పెచ్చులు ఊడిపడి రోగులు గాయపడిన ఘటనపై బీజేపీ శ్రేణులు ఎంజీఎం వద్ద నిరసన చేపట్టాయి. అధికారులు ఆస్పత్రిని సందర్శిస్తున్న సమయంలో నిరసనకు దిగిన బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంజీఎం భవనం భద్రతపై బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.

# సుందరయ్యనగర్‌లో మహా అన్నదానం..

- **విజయ విఘ్నేశ్వరుడి సన్నిధిలో అన్నప్రసాద వితరణ..**
- **రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు**

**మణుగూరు, మహా :** శ్రీశ్రీశ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుందరయ్య నగర్ 1లో సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చేపట్టిన అన్నదానంలో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రాకతో సుందరయ్యనగర్ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దోసపాటి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా సుందరయ్యనగర్ 1లో విజయ విఘ్నేశ్వర స్వామి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది మహా అన్నదానానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. అన్నదాన కార్యక్రమం విజయవంతానికి యూత్ సభ్యులు ఎస్కే రఫీ, సూరారపు అనిల్‌కుమార్‌రెడ్డి, పోలోజు సతీష్‌చారి, కోటగిరి మహేష్, ధూపకుంట్ల వెంకటేష్, దేశెట్టి కిషోర్, ఆసిఫ్, పోలోజు వెంకటేష్ దాతలుగా సహకరించారు. వారి సహకారంతో గతంలో కంటే పెద్దఎత్తున అన్నదానం నిర్వహించగలిగామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించనున్న విజయ విఘ్నేశ్వర స్వామి నిమజ్జన శోభాయాత్రను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి నిమజ్జన ఊరేగింపులో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పసునూరి రాము, పి సతీష్, వి సంతోష్, డిస్ట్రిబ్యూటర్ రమణ, హేమాద్రితో పాటు యూత్ సభ్యులు, భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపివి చీప్ పాలిటిక్స్..

- **నిమజ్జన ఏర్పాట్లపై రాద్ధాంతం ఏంటి**
- **పవిత్ర పండుగలను రాజకీయం చేయడం తగదు**
- **మేడిపల్లి సత్యం చొరువతో నీటి విడుదల**
- **అనంతుల రమేశ్**



**సీసీ అధికార ప్రతినిధి :** కరీంనగర్ మహా : వినాయక నిమజ్జన ఏర్పాట్ల విషయంలో బిజెపి పార్టీ చీప్ పాలిటిక్స్ రాజకీయాలకు తెర లేపడం సిగ్గుచేటని డిసిసి అధికార ప్రతినిధి అనంతుల రమేష్ మండిపడ్డాడు.. సోమవారం కొత్తపల్లి వెలిచాల ప్రజా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. ఈ సందర్భంగా గత కొన్నేళ్లుగా కరీంనగర్ పట్టణంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లు అంగరంగ వైభవంగా సాగుతున్నాయని, తాజాగా నిమజ్జనానికి నీళ్లు వదలం లేదని బిజెపి దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని కైవాసం చేసుకున్న బిజెపి పండుగ ఏర్పాట్లను నిమజ్జనం చేసే విషయంలో బాధ్యత యుతంగా వ్యవహరించాల్సింది పోయి ధర్నాలకు దిగి,అనవసర అల్లర్లకు ఆజ్యం పోయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రతి ఏటా నిధుల కేటాయింపు తో పాటు ఎస్సారెస్పీ నీటి విడుదలపై చర్యలు తీసుకుంటున్న విషయం బిజెపికి తెలియంది కాదని, ప్రజల దృష్టి మరల్చేందుకు నిమజ్జనం ఏర్పాట్లను కూడా రాజకీయం చేయడం బిజెపికే చెందిందని మండిపడ్డారు.. ఎస్సారెస్పీ నీటి విడుదల విషయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి తోటి మాట్లాడి నీటి విడుదలకు కృషి చేశారని అన్నారు.. నీటి విడుదల ప్రక్రియను గమనించిన బిజెపి నాయకులు నీటి విడుదల క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు చీప్ పాలిటిక్స్ కు పాల్పడడం సిగ్గుచేటని అన్నారు.. పవిత్రమైన పండుగలను కూడా రాజకీయాలకు జోడించి లబ్ది పొందాలని బిజెపి తీరును ప్రజలు గమనిస్తున్నారని ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని హితవు పలికారు..



# గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- **కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి మహా** : జిల్లాలో అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎంపీవోలు, డీఎల్పీవోలతో గ్రామీణ పారిశుధ్యంపై సమీక్ష నిర్వహించారు.గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. కోతులు, కుక్కల బెడద ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ తప్పనిసరిగా నిర్వహించి, నీటి నాణ్యతను పర్యవేక్షించాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, నీరు నిలిచే ప్రాంతాలను శుభ్రం చేయాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీమాల, ఎంపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- **సీఎం రిలీఫ్ ఫండ్ పేదలు వినియోగించుకోవాలి**
- **కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**
- **ఆరుట్లలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**

**మంచాల సెప్టెంబర్ 21 మహా:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజాప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు నూకం బాలరాజు, చిందం శ్రీశైలంల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజురైన, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆరుట్ల గ్రామంలోని లబ్దిదారులకు ఇంటింటికి తిరిగి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కొరకు అనేక పథకాలు తీసుకొచ్చిందని, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధిలో ముందంజలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, వార్డు సభ్యులు అనంగల్ల జగన్నాధం, ఎండి ఇమ్రాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, అంతటి రాజుగౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర్సింహా బుట్టి కృష్ణ, మార లక్ష్మణ్, కంబాలపల్లి బుగ్గరాములు, కోరె బాబు తదితరులు పాల్గొన్నారు.

# కష్టంలో తోటి కార్మికుడికి బాసట..

- **రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన రైల్వే సైడింగ్ కాంట్రాక్ట్ కార్మికులు..**
- **ఆపదలో అండగా నిలవడమే నిజమైన ఐక్యత..**
- **ఐఎఫ్టీయూ మంగీలాల్**

**మణుగూరు, మహా :** కష్టకాలంలో ఉన్న తోటి కార్మికుడికి అండగా నిలిచి సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు మానవత్వాన్ని చాటుకున్నారు. భార్యను కోల్పోయి విషాదంలో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుడు కురం నాగేశ్వరరావు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి మేమున్నాం అంటూ భరోసా కల్పించారు. సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్ట్‌లో పనిచేస్తున్న కురం నాగేశ్వరరావు భార్య రమణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం ఆమె దశదిన కార్యక్రమం సందర్భంగా నాగేశ్వరరావు స్వగృహానికి చేరుకున్న తోటి కార్మికులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి తమవంతు అండగా నిలవాలనే ఉద్దేశంతో కార్మికులంతా కలిసి సమకూర్చిన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్షుడు, ఐఎఫ్టీయూ మణుగూరు ఏరియా నాయకుడు ఏ మంగీలాల్ మాట్లాడుతూ జీవితాంతం తోడుగా ఉంటామని బాస చేసుకున్న జీవిత భాగస్వాముల్లో ఒకరు దూరమైతే కలిగే బాధను మాటల్లో వర్ణించలేమన్నారు. ఇలాంటి విషాద సమయంలో తోటి కార్మికులు నాగేశ్వరరావు కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. రమణ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి తోటి కార్మికులు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు కె రవికుమార్, కె గురుమూర్తి, జి.నాగేశ్వరరావు, ఎం హౌసింగ్, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్కే రజబ్ అలీ, ఐ గోపి, కె నాగరాజు, కె సంపత్‌కుమార్, ఎం గురుప్రసాద్, వై శంకర్, కె శ్రీనుతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.





## మణుగూరును పంచాయతీగా మార్చాలి..

**మణుగూరు, మహా :** ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరులో దీర్ఘకాలంగా నెలకొన్న స్థానిక పాలన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అవసరమైతే మణుగూరు మున్సిపాలిటీని తిరిగి గ్రామ పంచాయతీగా మార్చి ప్రజలకు ఎన్నికైన పాలకవర్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కొమ్ము హుస్సేన్ మాదిగ కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. మణుగూరు మున్సిపాలిటీ ఏర్పడి రెండు దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ స్థానిక సంస్థ ఎన్నికలు జరగకపోవడంతో ప్రజలు ప్రజాప్రతినిధులతో కూడిన స్థానిక పాలనకు దూరమయ్యారని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించిన చట్టపరమైన అంశాల నేపథ్యంలో మణుగూరు స్థానిక సంస్థ హోదాపై వివాదం కొనసాగుతోందని, దీంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని గిరిజనులు, నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో అమలయ్యే ఉపాధి హామీ వంటి పథకాల ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు. ఇళ్లకు సంబంధించిన అధికారిక ధ్రువీకరణలు, ఆస్తుల పేర్ల మార్పులు, పంపకాలు తదితర అంశాల్లోనూ స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడానికే పరిపాలన పరిమితం కాకుండా మౌలిక సదుపాయాలు, ఉపాధి, ఆస్తులకు సంబంధించిన సేవలు సమర్థంగా అందించాలని కోరారు. ముఖ్యంగా గిరిజనులు, నిరుపేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మణుగూరు స్థానిక సంస్థ హోదాపై నెలకొన్న సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపేలా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మణుగూరులో ఎన్నికలు నిర్వహించేందుకు ఉన్న చట్టపరమైన అడ్డంకులను పరిష్కరించాలని, అది సాధ్యం కానిపక్షంలో గ్రామ పంచాయతీగా మార్చే అంశాన్ని పరిశీలించి ప్రజలకు ఎన్నికైన స్థానిక పాలన అందేలా ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేయాలని కొమ్ము హుస్సేన్ మాదిగ కోరారు.

# 80మంది గర్భిణీ లకు సామూహిక శ్రీమంతాలు

**దమ్మపేట ,మహా :** స్థానికంగా ఉన్న మండల కేంద్రంలో ని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో సామూహిక శ్రీమంతాలు జరిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు అరుణానంద స్వామీజీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా విచ్చేశారు. దాదాపుగా 80 మంది గర్భిణులు నిరుపేద ,మద్యతరగతి కుటుంబాలకు చెందిన వారిని గుర్తించి సాంప్రదాయక పద్ధతిలో వైద్య బృందం సబ్యుల సూచనలతో నిర్వహించారు. ప్రతి మహిళకు పసుపు ,కుంకుమ ,తో ముత్తైదువులతో చీర,గాజులు ,పూలు ,పండ్లు అందజేసి సాంప్రదాయ పరంగా జరిపారు. అనంతరం అరుణానంద స్వామి జీ మాట్లాడుతూ మాతృత్వం అనే గొప్ప వరాన్ని ఆ భగవంతుడు మహిళలకే అందించడం చాలా శుభ సూచకమని తెలిపారు. మహిళా మూర్తులకు ఉన్న ఓర్పు ,సహనం ,పట్టుదల ,మనో నిబ్బరం మరెవ్వరికీ ఉండదని , భూదేవి ని కూడా ఓ స్త్రీ గానే మన పూర్వీకులు పోల్చుతూ , భూదేవి అంత ఓర్పు ,సహనం కలిగి ఉండాలమ్మ అంటూ క్రొత్తగా వివాహమైన ఆడపడుచులను దీవిస్తుంటారని అన్నారు. ఉత్తమ స్త్రీలను గౌరవిస్తే ఆ భగవంతున్ని గౌరవించినట్లేనంటూ మహిళల ఔన్నత్యాన్ని గుర్తు చేశారు. గర్భిణీ లు గా క్రొత్త అవతారం దాల్చిన వారిని వారి కుటుంబ సబ్యులు అతి జాగ్రత్తగా చూసుకుంటూ ,ప్రేమానురాగాలు పంచాలని అన్నారు. గర్భిణీ నుండి మాతృత్వం దాల్చడం అనేది మహిళలకు మరో జన్మవంటిదని



,కాబట్టి ప్రతిక్షణం సంతోషంగా వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని తెలిపారు. ఇంతమంది మద్యతరగతి ,నిరుపేదలకు సామూహికంగా శ్రీమంతాలు చేయించే మంచి అవకాశం కల్పించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆలయకమిటీ చైర్మన్ పసుమర్తి రామభద్రరావు ,కుసుమా దంపతులు తగు ఏర్పాట్లు గావించి , మజ్జిగ ,మధ్యాహ్న భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయడం పట్ల ట్రస్టు సబ్యులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు , బిఆర్ఎస్ నాయకులు సోయం వీరభద్రరావు , చారిటబుల్ ట్రస్టు రాష్ట్ర అద్యక్షులు గిద్దా కొండయ్య , ప్రసూతి వైద్యులు పసుమర్తి మౌనిక ,వైద్యసిబ్బంది ,భక్తులు నాగవర్ధనమ్మ ,వీర వెంకయ్య ,రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.



# వినాయకుడిని దర్శించుకున్న దాసరి ఉష

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస్, 1వ వార్డు సభ్యులు కోమల్ల కృష్ణ కుమార్, 2వ వార్డు సభ్యులు కలువల జీవనజ్యోతి తిరుపతి, 3వ వార్డు సభ్యులు కూకట్ల నవీన్ యాదవ్ పాల్గొన్నారు.ముదిరాజ్ సంఘం నాయకులు కలువల ఓదెలు, తూడి రాజయ్య, తోడిసదయ్య, ఈర్ల ఐలయ్య, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

మంచిర్యాల, మహా: జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రహదారి భద్రత సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లపై అనధికార పార్కింగ్, ఆక్రమణలు, చెత్త, ఇతర ఆటంకాలను తొలగించాలని తెలిపారు. ఓవర్‌లోడింగ్, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ ప్రయాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రోడ్లపై సంచరించే పశువులను గోశాలలకు తరలించాలని తెలిపారు. డి.సి.పి. ఎ. భాస్కర్ మాట్లాడుతూ 2026లో ఇప్పటివరకు జిల్లాలో 429 రోడ్డు ప్రమాదాలు జరగగా 95 మంది మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, సబ్ కలెక్టర్ మనోజ్ పాల్గొన్నారు.



మహా పత్రిక





# మృణాల్ ఠాకూర్ అందాల మెరుపులు

మృణాల్ ఠాకూర్ మరోసారి తన అందంతో అభిమానులను ఆకట్టుకున్నారు. మెరిసే పాస్టెల్ రంగు చీరలో సంప్రదాయ, ఆధునిక శైలుల కలయికతో కనిపించిన ఆమె లుక్ ప్రత్యేకంగా నిలిచింది. చీరకు తగ్గట్టుగా అందమైన ఎంబ్రాయిడరీతో రూపొందించిన బ్లౌజ్‌ను ధరించిన మృణాల్.. మెడలో కుందన్ ఆభరణాలు, చెవులకు అందమైన జుమ్కాలు, జుట్టులో సున్నితమైన పూల అలంకరణతో మరింత ఆకర్షణీయంగా కనిపించారు. మేకప్‌ను సింపుల్‌గా ఉంచుతూ సహజమైన అందానికి ప్రాధాన్యం ఇచ్చిన ఆమె.. కెమెరా ముందు ఎంతో నమ్మకంగా పోజులిచ్చారు. ప్రశాంతమైన ముఖ కవళికలు, సహజమైన చిరునవ్వుతో ఆమె లుక్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. సంప్రదాయ చీరకట్టులోనూ తనదైన స్టైల్‌ను చూపిస్తూ మృణాల్ మరోసారి ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకున్నారు.మృణాల్ ఠాకూర్ నటిగా తన ప్రయాణాన్ని టెలివిజన్ రంగం నుంచి ప్రారంభించారు. ప్రముఖ హిందీ సీరియల్ 'కుంకుమ్ భాగ్య'లో నటించి బుల్లితెర ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. టెలివిజన్‌లో వచ్చిన పాపులారిటీతో సినిమాల వైపు అడుగులు వేసిన ఆమె.. 2014లో మరాఠీ చిత్రసీమలోకి ప్రవేశించారు. తొలి దశలోనే విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ తన నటనా సామర్థ్యాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. 2018లో విడుదలైన 'లవ్ సోనియా' చిత్రంతో మృణాల్‌కు హిందీ చిత్రసీమలో మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమాలో ఆమె పోషించిన పాత్రకు ప్రేక్షకులు, సినీ విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. ఆ తర్వాత 'సూపర్ 30', 'బట్లా హౌస్' వంటి చిత్రాల్లో నటించి బాలీవుడ్‌లో తన స్థానాన్ని మరింత బలపర్చుకున్నారు. చిన్న పాత్ర అయినా కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకోవడం ద్వారా తన నటనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే మృణాల్ కెరీర్‌లో 'సీతా రామం' చిత్రం కీలక మలుపుగా నిలిచింది. 2022లో విడుదలైన ఈ ప్రేమకథా చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన సీత పాత్రలో ఆమె నటించారు. సంప్రదాయమైన పాత్రలో భావోద్వేగాలను పలికించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా తెలుగు, తమిళ, మలయాళ, హిందీ ప్రేక్షకుల్లోనూ మృణాల్‌కు మంచి క్రేజ్ తీసుకొచ్చింది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు ఆమె మరింత దగ్గరయ్యారు. ఆ తర్వాత 'హాయ్ నాన్న' చిత్రంతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చారు. నాని సరసన నటించిన ఈ సినిమాలో భావోద్వేగాలతో కూడిన పాత్రను పోషించి మెప్పించారు. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, భావోద్వేగాల నేపథ్యంలో సాగిన ఈ కథలో మృణాల్ నటనకు మంచి స్పందన వచ్చింది. వరుసగా విభిన్నమైన పాత్రలు రావడంతో దక్షిణాది చిత్రసీమలోనూ ఆమెకు అవకాశాలు పెరిగాయి. మృణాల్ ఠాకూర్ తన కెరీర్‌లో ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా విభిన్నమైన కథలను ఎంచుకుంటున్నారు. ప్రేమకథలు, భావోద్వేగభరిత చిత్రాలు, థ్రిల్లర్లు, కమర్షియల్ ఎంటర్‌టైనర్లలో నటిస్తూ తనలోని నటనా వైవిధ్యాన్ని చూపిస్తున్నారు. హిందీతో పాటు తెలుగు సినిమాల్లోనూ తన మార్కెట్‌ను విస్తరించుకుంటూ ముందుకు సాగుతున్నారు. తెరపై నటనతో పాటు ఫ్యాషన్, గ్లామర్ విషయంలోనూ తనదైన శైలిని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'దూ దీవానే సే షహర్ మే' చిత్రంతో పాటు ద్విభాషా ప్రాజెక్ట్ 'డాకోయిట్: ఏ లవ్ స్టోరీ'లోనూ నటిస్తున్నారు. అలాగే వరుణ్ ధావన్‌తో కలిసి 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రంలో కనిపించనున్నారు. మరోవైపు 'పూజా మేరీ జాన్' చిత్రానికి సంబంధించిన స్ట్రీమింగ్ విడుదలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న మృణాల్.. ఇటు నటనతో, అటు తన స్టైలిష్ లుక్స్‌తో అభిమానులను అలరిస్తున్నారు.



# ఫ్యాన్స్ కోసం నాని స్పెషల్ ట్రీట్

'ది ప్యారడైజ్' విడుదలకు ముందు నేచురల్ స్టార్ నాని తన అభిమానులతో ప్రత్యేకంగా మమేకమయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన భారీ ఫ్యాన్స్ మీట్‌కు వేలాది మంది అభిమానులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. తమ అభిమాన హీరోను కలుసుకునేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు రావడంతో అక్కడ ప్రత్యేక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నాని అభిమానులతో ఎంతో సమయం గడిపారు. తనను కలిసేందుకు వచ్చిన వారితో ఫొటోలు దిగుతూ, వారితో ముచ్చటిస్తూ సందడి చేశారు. సుమారు 10 వేల మందికి పైగా అభిమానులతో ఫొటోలు దిగినట్లు సంబంధిత కథనాలు పేర్కొన్నాయి. గంటల తరబడి అభిమానులను కలుస్తూ నాని చూపించిన ఓపిక ప్రత్యేకంగా నిలిచింది. అభిమానులు కూడా తమ హీరోతో ఫొటోలు దిగేందుకు ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఫ్యాన్స్ మీట్‌కు వచ్చిన అభిమానుల కోసం నాని ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించారు. వెజ్, నాన్‌వెజ్ వంటకాలతో విందు ఏర్పాటు చేసినట్లు పలు కథనాలు వెల్లడించాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులకు ఈ కార్యక్రమం ఒక ప్రత్యేక అనుభూతిగా మారింది. హీరోతో ఫొటో దిగడంతో పాటు తమకు ఏర్పాటు చేసిన విందులో పాల్గొని అభిమానులు ఆనందించారు. మరోవైపు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. యాక్షన్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నాని కొత్త తరహా పాత్రలో కనిపించనున్నారు. సినిమా విడుదలకు ముందు జరుగుతున్న ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా అభిమానులతో నాని నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. 'దసరా' తర్వాత శ్రీకాంత్ ఓదెల-నాని కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'పై ఆసక్తి నెలకొంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో పలువురు ప్రముఖ నటీనటులు భాగమవుతున్నారు. సెప్టెంబర్ 24న సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. నాని తన అభిమానులతో నేరుగా గడిపిన ఈ సమయం సోషల్ మీడియాలోనూ చర్చనీయాంశంగా మారింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా జరిగిన ఫ్యాన్స్ మీట్.. అభిమానులు, హీరో మధ్య ఉన్న అనుబంధాన్ని మరోసారి చూపించే కార్యక్రమంగా నిలిచింది.





# దర్శకుడిగా కార్తికేయ..

'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో కార్తికేయ గుమ్మకొండ ఇప్పుడు కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. కొంతకాలం విరామం తర్వాత 'కమ్‌బ్యాక్' పేరుతో కొత్త సినిమాను ప్రకటించిన ఆయన.. ఈసారి హీరోగా మాత్రమే కాకుండా దర్శకుడిగానూ బాధ్యతలు చేపట్టారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. కార్తికేయ స్వయంగా కథను సిద్ధం చేసి దర్శకత్వం వహించడంతో పాటు ఇందులో ప్రధాన పాత్రలోనూ నటిస్తున్నారు. బాక్సింగ్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆయన బాక్సర్‌గా కనిపించనున్నారు. విడుదలైన గ్లింప్స్‌లో కార్తికేయ బాక్సింగ్ రింగ్‌లో శిక్షణ తీసుకుంటూ, స్కిప్పింగ్ చేస్తూ కనిపించారు. పాత్ర కోసం ఆయన తన లుక్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. మూడు సంవత్సరాలుగా బాక్సింగ్ ప్రపంచానికి దూరంగా ఉన్న ఓ బాక్సర్ గురించి గ్లింప్స్‌లో వినిపించే వాయిస్‌ఓవర్ ఆసక్తిని పెంచుతోంది. అతను ఇంతకాలం ఎక్కడ ఉన్నాడు? తిరిగి బరిలోకి దిగితే ఏం చేయగలడు? అనే ప్రశ్నలను రేకెత్తించేలా గ్లింప్స్‌ను రూపొందించారు. ఈ నేపథ్యంతో కథపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడుతోంది. ఈ చిత్రాన్ని కార్తికేయ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై రూపొందిస్తున్నారు. కార్తికేయ సతీమణి లోహితా రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సరస్వతి శుక్లా సమర్పిస్తున్న ఈ సినిమాకు సూర్య ఆకెళ్ల క్రియేటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. జగదీశ్ చీకటి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం, నేపథ్య సంగీతం అందిస్తున్నారు. కళ్యాణ్ సూర్యప్రకాష్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కార్తికేయ తన కెరీర్‌ను 'ఆర్‌ఎక్స్ 100'తో ప్రారంభించి హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం 'నానీస్ గ్యాంగ్ లీడర్', అజిత్ నటించిన 'వలిమై' వంటి చిత్రాల్లో ప్రతినాయక పాత్రల్లోనూ కనిపించి మెప్పించారు. 2024లో వచ్చిన 'భజే వాయు వేగం' తర్వాత ఆయన నుంచి కొత్త ప్రాజెక్ట్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు 'కమ్‌బ్యాక్' సినిమాతో హీరోగా తిరిగి రావడమే కాకుండా తొలిసారి దర్శకుడిగా తన ప్రతిభను పరీక్షించుకోనున్నారు. నటుడిగా, రచయితగా, దర్శకుడిగా ఒకేసారి పలు బాధ్యతలు చేపడుతున్న కార్తికేయకు ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకమైనది. బాక్సింగ్ నేపథ్యం, కొత్త లుక్, గ్లింప్స్‌లో కనిపించిన యాక్షన్ అంశాలతో 'కమ్‌బ్యాక్' సినిమాపై ఆసక్తి నెలకొంది. సినిమా కథ, ఇతర నటీనటులు, విడుదల తేదీకి సంబంధించిన మరిన్ని వివరాలను చిత్రబృందం తరువాత వెల్లడించనుంది.

# గ్లామర్ లుక్‌లో అనుపమ పరమేశ్వరన్

కేరళకు చెందిన అందాల భామ అనుపమ పరమేశ్వరన్ తన తాజా ఫొటోషూట్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకున్నారు. భారీగా మెరిసే అలంకరణలతో రూపొందించిన గౌన్‌లో ఆమె ఎంతో అందంగా కనిపించారు. గాఢమైన ఎరుపు రంగు బ్యాక్‌డ్రాప్ ముందు కర్లీ హెయిర్‌తో పోజులిచ్చిన అనుపమ.. పింక్ రంగు స్టేట్‌మెంట్ జ్యువెలరీతో తన లుక్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చారు. సహజమైన చిరునవ్వుతో, ఎంతో ఆత్మవిశ్వాసంగా కనిపించిన ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. సంప్రదాయ అందంతో పాటు ఆధునిక ఫ్యాషన్ స్టైల్‌ను మేళవిస్తూ అనుపమ చేసిన ఈ ఫొటోషూట్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.అనుపమ పరమేశ్వరన్ 2015లో విడుదలైన మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. ఈ చిత్రంలో మేరీ జార్జ్ పాత్రలో నటించిన ఆమె.. తొలి సినిమాతోనే ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. 'ప్రేమమ్' ఘన విజయం సాధించడంతో అనుపమకు వరుస అవకాశాలు వచ్చాయి. ఆ తర్వాత 2016లో 'అ ఆ' సినిమాతో తెలుగు చిత్రసీమలోకి ప్రవేశించారు. అదే ఏడాది 'కొడి' చిత్రంతో తమిళ సినిమాల్లోనూ నటించారు. తక్కువ సమయంలోనే మూడు దక్షిణాది భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

తెలుగు చిత్రసీమలో అనుపమ పలు విభిన్నమైన పాత్రల్లో కనిపించారు. ప్రేమకథలు, కుటుంబ కథా చిత్రాలు, థ్రిల్లర్లు, కమర్షియల్ ఎంటర్‌టైనర్లలో నటిస్తూ తన నటనా పరిధిని చాటుకున్నారు. పాత్ర ఏదైనా సహజమైన నటనతో ప్రేక్షకులకు దగ్గరవడం ఆమె ప్రత్యేకతగా మారింది. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను కూడా ఎంచుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతున్నారు. 2024లో వచ్చిన 'టిల్లు స్క్వేర్' చిత్రంతో అనుపమకు మరింత క్రేజ్ వచ్చింది. సిద్ధు జొన్నలగడ్డతో కలిసి నటించిన ఈ సినిమాలో ఆమె పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం 2025లో 'డ్రాగన్', 'పరదా' వంటి చిత్రాల్లోనూ నటించారు. విభిన్నమైన కథాంశాలను ఎంచుకుంటూ దక్షిణాది చిత్ర పరిశ్రమల్లో తన మార్కెట్‌ను విస్తరించుకుంటున్నారు.

ప్రస్తుతం అనుపమ పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'క్రేజీ కళ్యాణం', 'భోగి' వంటి చిత్రాలతో పాటు 'మరీచిక', 'లాక్‌డౌన్' తదితర బహుభాషా ప్రాజెక్టుల్లోనూ ఆమె నటిస్తున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన ఫొటోషూట్లు, సినిమా అప్‌డేట్లను అభిమానులతో పంచుకుంటున్నారు. తాజాగా ఎరుపు రంగు నేపథ్యంతో భారీగా అలంకరించిన గౌన్‌లో కనిపించిన అనుపమ లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com